

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024 | 5





చిక్కుడు..దొరకడు : గురువారం రాత్రి అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



సర్కారు దవాఖానా.. సమస్యలు చానా!

బోధనాసుపత్రికి..బోలెడు సమస్యలు

- అందని పూర్తిస్థాయి వైద్యం
- ప్రతి రోజూ ఓపీ 1100
- భవనం లేదు..సిబ్బంది కొరత
- రేడియాలజిస్ట్ పోస్టులు ఖాళీ
- మందకొడిగా కాలేజీ పనులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 : రాజమహేంద్రవరం బోధనాసుపత్రి (జీజీహెచ్)లో బోలెడన్ని సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆసుపత్రి స్థాయికి తగినట్టుగా పూర్తిస్థాయి సౌకర్యాలతో ప్రధాన భవనం లేకపోవడం వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరోపక్క వైద్యులు, పారామెడికల్, మినిస్టీరియల్ సిబ్బంది కొరత వేధిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ తీసుకొచ్చామంటూ ఊకదంపుడు ప్రచారం చేసుకుని కీలకమైన బోధనాసుపత్రిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇక మెడికల్ కాలేజీ పనులు అయినా ముందుకు సాగుతున్నాయా అంటే అదీ లేదు. కేవలం 25 శాతం పనులు మాత్రమే జరిగాయి.

సీటీ ఉంది..రేడియాలజిస్ట్ లేరు..

జీజీహెచ్‌లో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఆల్ట్రా సౌండ్ వంటి క్రిటికల్ డయాగ్నసిస్ యంత్రాలు ఉన్నాయి. రోగికి వ్యాధి నిర్ధారణలో ఈ మూడు విభాగాలు అత్యంత కీలకం. జబ్బును బట్టి ఆయా విభాగాల్లో స్కానింగ్ పరీక్షలు జరుగుతుంటాయి. అయితే సీటీస్కాన్, ఆల్ట్రా సౌండ్ పరీక్షలు చేయడానికి రేడియాలజిస్టులు లేకపోవడం గమనార్హం. రేడియాలజీ విభాగానికి హెచ్‌వోడీగా ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండాలి. అయితే ఒక్కరూ కూడా లేరు. రేడియాలజిస్టులు లేకపోవడంతో బోధనాసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందడంలేదు. ఆల్ట్రాసౌండ్, సీటీ కోసం రేడియాలజిస్టులను తాత్కాలికంగా తీసుకొస్తున్నా ఏదో మొక్కుబడిగానే సేవలందుతున్నాయనే విమర్శలున్నాయి.కొన్ని కీలకమైన విభాగాలకు ఇంకా ఎక్విప్‌మెంట్ రావాల్సి ఉంది. న్యూరో సర్జికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో లేదు.



650 బెడ్స్ ఏర్పాటు ఎలా?

బోధనాసుపత్రిలో రోగుల బెడ్స్ సంఖ్య 650కి పెంచాలని జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 350 శాంక్షన్ బెడ్స్‌తో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. అరకొర సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది కొరతతో నెట్టుకొస్తున్న ఈ తరుణంలో బెడ్స్ పెంచాలంటే ఎలా అంటూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.మెయిన్ బిల్డింగ్ అందుబాటులోకి వస్తే ఈ సమస్య చాలా వరకూ తీరే అవకాశం ఉంది. జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఓపీ 1100 నుంచి 1400 వరకూ ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో బెడ్స్ పెంచాలనే ప్రతిపాదన తప్పనిసరిగా మారింది.

వైద్యులు, సిబ్బందీ కొరత ...

మరో పక్క జీజీహెచ్‌లో కొన్ని విభాగాలకు డాక్టర్స్ కొరత వేధిస్తోంది. జనరల్ మెడిసిన్‌కు మరింత మంది డాక్టర్లు అవసరం ఉంది. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలి. ఆప్తమాలజీ విభాగంలోనూ ఒక్కరే ఉన్నారు. కొత్త జీవో ప్రకారం స్టాఫ్‌ను నియమించాల్సి ఉన్నా ఇంకా పూర్తికాలేదు. ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు (ఎస్‌ఆర్)లు రావాల్సి ఉన్నా ఒక్కరు కూడా లేరు. స్టాఫ్ నర్సుల అవసరం చాలా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. జీజీహెచ్‌కు మినిస్టీరియల్, పారామెడికల్ అందరూ కలిపి 484 మందిని ఎలాట్ చేయగా ఇందులో 180 మంది స్టాఫ్ కొరత ఉండడం గమనార్హం.

నేడు ఆసుపత్రిని సందర్శించనున్న మంత్రి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం రాజమహేంద్రవరం బోధనాసుపత్రిని సందర్శించనున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, సమస్యలపై జిల్లా అధికారులు, ఆసుపత్రి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మెడికల్ కాలేజీ పనుల పురోగతిపైనా ఆయన రివ్యూ చేసే అవకాశం ఉంది. దీంతో మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి అధికారులు అన్ని వివరాలతో సమీక్షకు సిద్ధమవుతున్నారు.

దీవించు లక్ష్మీగణేశా!



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13 : జిల్లాలో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. కమిటీ సభ్యులు తమ శక్తి మేరకు కార్యక్రమాలు చేస్తున్నారు. నాళం భీమరాజు వీధిలోని సిద్ధి లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శుక్రవారం డాల్లా మురళి లలిత దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి కుంకుమార్చన వైభవంగా చేశారు. ఏకంగా 3 వేల మంది మహిళలు హాజరై అమ్మవారికి పసుపు,కుంకుమ, 108 శ్రీకూర్మం ప్రతిమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా పూజ చేస్తే అష్టయిశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. అనంతరం 108 శ్రీకూర్మం ప్రతిమలను ఆయా భక్తులకే అందజేయడం విశేషం. ఆలయ కమిటీ సభ్యులు మాటూరి రంగారావు,శెట్టి జగదీష్,మాటూరి సిద్దు, మద్ది నారాయణరావు, నల్లం ఆనంద్, బ్రింగ్‌మళ్ళ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పట్టుకోండి.. చూద్దాం!?

చిక్కని చిరుత

తొలిసారి కనిపించింది ఇక్కడే : అటవీ ప్రాంతానికి ఎదురుగా ఉన్న నివాసం

- ట్రాప్ కెమెరాకు రోజూ ఫోజు
- వారమైనా ఇంకా కానరాని జాడ
- హైవేకు 5 కి.మీ పరిధిలోనే సంచారం
- ప్రకటనలకే అధికారులు పరిమితం
- జనానికి దినదిన గండం
- అటవీ ప్రాంతం వద్ద రక్షణ చర్యల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అటవీ అధికారులకు చిరుత పులి వారం నుంచీ సవాల్ విసురుతుంది. రాజమహేంద్రవరం శివారు రిజర్వు ఫారెస్టులోకి సరిగ్గా వినాయక చవితి ముందు రోజు 6న తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ప్రవేశించి వారమైనా నేటి వరకూ చిక్క లేదు. నాటి నుంచి రోజూ ఫొటోకు పోజులిచ్చి చక్కా తిరుగుతుంది.ట్రాప్, సీసీ కెమెరాలు, పాద ముద్రల అంచనా.. చివరికి డ్రోన్ కెమెరాను రంగంలోకి దింపినా ఫలితం కాన రావడం లేదు. రిజర్వు ఫారెస్టును నివాసం ఉండే జనాలకు కంటిపై కునుకు ఉండడం లేదు. ఇక చిరుత దయతలచి బోనులో దూరడమో లేక ఇక్కడి నుంచి జారుకోవడమో చేసే వరకూ చూస్తూ ఉండడమే తప్ప చేసేదేమీ లేదనే ధోరణికి అధికారులు దాదాపుగా వచ్చేశారు. గతంలో ప్రత్తిపాడు ప్రాంతంలో చిరుత పులి సంచరించి నప్పుడు అధికారుల హడావుడే పైచేయి సాధించింది.పులి మాత్రం జనాలపై జాలిపడి వనానికి వెళ్లిపోయింది. ఇప్పుడూ అదే పరిస్థితి రావాలేమో.

5 కిలోమీటర్ల పరిధిలో తిరిగినా?

మూడునాలుగేళ్ల మగ చిరుతపులిగా నిర్ధారణకు వచ్చారు. బరువు సుమారు 70 కిలోలుగా అంచనా వేశారు. వేటాడే సామర్థ్యం అధికం. ఇప్పటి వరకూ మనుషుల జోలికి రాకపోయినా..ఇకపై రాదని స్పష్టంగా భరోసా ఇవ్వలేం. చిరుత 5 కిలోమీటర్ల పరిధిలోనే సంచరిస్తోందని అంచనా.లాలాచెరువు దాటిన తర్వాత రోడ్డును దాటుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చిరుత సంచరిస్తున్న రిజర్వు ఫారెస్టులో అడవి పందులు,నాటు పందులు, కోతులు, ముళ్ల పందులు, కుక్కలు ఉండడంతో ఆహారం పుష్కలంగా లభిస్తోంది. చిరుత ఒకసారి వేటాడి రెండు రోజులపాటు ఆరగిస్తుంది.

ప్రయత్నలోపమే.. పులికి వరమా?

జిల్లా డీఎఫ్‌వో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కాకినాడ జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో) తూర్పు గోదావరి ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా భరణి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె నేతృత్వంలో సుమారు 50 మంది బృందాలుగా ఏర్పడి చిరుత కోసం అన్వేషిస్తున్నారు. కానీ ఫలితం ఏమీ లేదు. 530 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో 50 వరకూ ట్రాప్ కెమెరాలను, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను చెట్లకు బిగించారు. ఇవి ఫొటోలు తీస్తాయి. అటవీ సిబ్బంది వెళ్లి ఆ కెమెరాలను పరిశీలిస్తే గానీ పులి ఫొటోలు బయటకు రావు. కేవలం నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆ కెమెరాలను డీఎఫ్‌వో సెల్‌కి లింక్ చేశారు. కెమెరా ఫుటేజీని తరచుగా పరిశీలించే సమయం డీఎఫ్‌వోకి ఉండదు.థర్మల్ కెమెరాతో డ్రోన్‌ని రంగంలోకి దింపారు. ఈ కెమెరాకు ఒకసారి చార్జింగ్ చేస్తే 45 నిమిషాలపాటు మాత్రమే వాడుకొనే వీలుంది.జీవి శరీర ఉష్ణోగ్రత ఆధారంగా ఇది ఫొటోలు లేదా వీడియోలు తీస్తుంది.దానిని తర్వాత పరిశీలించుకొని ఫుటేజీ దాచుకోవడం తప్పచేసేదేమీ ఉండదు.పులి దయతలచి అటవీ అధికారులు ఏర్పాటు చేసిన బోనులోకి వెళితేగానీ ఏమీ చేయలేని పరిస్థితి.

చిరుత పులిని పట్టుకుంటాం : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు : దివాన్‌చెరువు అటవీప్రాంతంలోనే చిరుతపులి ఉందని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాల్లో గురువారం చిరుతపులి సిత్రాలు కనపడ్డా యన్నారు. చిరుతపులిని ఖచ్చితంగా పట్టుకుంటామన్నారు. దివాన్ చెరువు అటవీ ప్రాంతాన్ని అనుకుని జాతీయ రహదారిపై వేగ నియంత్రణ బోర్డులు, చిరుత పులి సంచరించే ప్రాంతం అని తెలిపే బోర్డు హైవేపై ఏర్పాటు చేయించామన్నారు.అయితే లాలాచెరువు వద్ద ఒకే ఒక బోర్డు ఏర్పాటు చేసి వదిలేయడంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ మాటలే..రక్షణ చర్యల్లేవ్..

ఒడ్డున కూర్చొని ఎన్ని మాటలైనా చెప్పొచ్చు.. నీట మునిగే వాడికే దడ పుడుతుందంటారు పెద్దలు. ఇప్పుడు చిరుత విషయం లోనూ అధికారుల తీరు అలాగే ఉందనే చర్చ నడుస్తోంది. రిజర్వు ఫారెస్టును ఆనుకొని ఉన్న శ్రీరాంపురం, తారకరామానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రూపానగర్, పద్మావతినగర్, ఆకాశవాణి రిలే కేంద్రం పరిసరాలు, ఆటోనగర్, దివాన్‌చెరువు తదితర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీ ప్రాంతంలో ఆవాసాల వాళ్లు వ్యర్థాలను ఇంటి బయట పడేయవద్దని.. ఇంటి వద్ద తగు లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే ఆయా ఆవాసాల ప్రజల నుంచి వ్యర్థాలను సేకరించే ఏర్పాటు లేదు. దీంతో బయట పారేయడం తప్ప మరో మార్గం లేదు.ఇళ్ల వద్ద లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సెలవిచ్చిన అధికారులు లాలాచెరువు దాటిన తర్వాత ఆటోనగర్ వరకూ తగు లైటింగ్ ఏర్పాటు చేయడం మరిచారు.ఇక్కడ చెట్లు గుబురుగా ఉండడంతో కాస్త చల్లగా ఉంటుందని వాహనదారులు పగలు, రాత్రి వేళల్లో కాసేపు ఆగుతుంటారు. వీరిని హెచ్చరించే విధంగా ఏర్పాట్లు చేయలేదు. కరపత్రాలు పంచిపెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా కనీస రక్షణ చర్యలు లేక అత్యవసర పనులు ఉన్నా బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఇప్పుడు చిరుతను సురక్షితంగా పట్టుకోవడం ఎంత ముఖ్యమో.. ప్రజలు దాని బారిన పడకుండా కాపాడడం అంతే ముఖ్యం. సీసీ కెమెరాలను ఎక్కువగా ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కంట్రోల్ రూంకి అనుసంధానించి నిరంతర నిఘా పెడితే ఫలితం ఉండొచ్చు. చిరుత సంచరిస్తోందని అంచనాకు వచ్చిన ప్రదేశాల్లో మాటు వేసి కంట్రోల్‌లోని ఫుటేజీలో కనబడిన వెంటనే చేరుకోగలిగితే చిరుత చిక్కే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



గోదారి వరద హెచ్చరికలు ఉపసంహరణ

సాధారణస్థాయికి చేరిన నీటిమట్టం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భయపెట్టిన గోదావరి తగ్గుముఖం పట్టింది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం రాత్రి 12 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.10 అడుగులగా ఉంది. బ్యారేజి నుంచి 10,33,672 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఇదిలా ఉండగా రాత్రి 12 గంటలకు బ్యారేజీ నీటిమట్టం 11.70 అడుగులకు పడిపోయింది. బ్యారేజీ నుంచి 9,81,043 క్యూసెక్కులు విడుదల చేయడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. గోదావరి శాంతించడంతో పరీవాహక ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం వద్ద రాత్రి 7 గంటల నుంచి వరద తగ్గుముఖం పట్టి నీటిమట్టం 39.40 అడుగులుగా ఉంది. ఆదివారం నాటికి అఖండగోదావరి, కోన సీమ లంకల్లోవరద నీరు బాగా లాగే అవకాశం ఉంది.



విద్యార్థినికి టంగుటూరి అవార్డు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నేటి నాయకులకు ఆదర్శం టంగుటూరి : దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 : టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎంతో ఆదర్శమైనదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రకేసరి టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవానికి హాజరై మాట్లాడారు. నేటితరం రాజకీయనాయకులకు టంగుటూరి జీవితం ఒక ఆదర్శప్రాయం అన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసినా కూడా ఒక సాధారణమైన జీవితాన్ని చిట్టచివరి వరకూ గడిపారన్నారు. అలాంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులందరూ చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుని పీజీ సెట్ పరీక్షలో 1 నుంచి 100లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు టంగుటూరి పేరున అవార్డులు అందజేశారు. నవంబరు 7, 8 తేదీల్లో ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబోయే అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఉపాధ్యక్షులు శ్రీరామమూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ముళ్ల మాధవ్, గద్దె సుధాకర్ పాల్గొన్నారు.

సాయం చేసే చేతులు..

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న.. ప్రస్తుతం అందరూ ఇదే చేస్తున్నారు..విజయవాడలో వరద నుంచి బయటపడిన బాధితులకు తలోకొంత సాయం అంద జేస్తున్నారు. కొంత మంది నగదు రూపేణా సీఎం సహాయ నిధికి అందజేస్తుంటే..మరికొంత మంది వస్తు రూపేణా అందజేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు.



రూ.3 లక్షల సామగ్రితో బయలుదేరిన వాసవీ క్లబ్ వ్యాన్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13 : విజయవాడ బుడమేరు వరద బాధిత ప్రజలకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రూ.3 లక్షలు విలువ చేసే సామాగ్రిని అందించారు. 600 దుప్పట్లు, 600 చీరలు, 600 తువ్వాళ్ళు, 300 స్టీల్ ప్లేట్స్, 300 స్టీల్ గ్లాసులు, నోట్ బుక్స్, స్టేషనరీ సామన్లుతో కూడిన వాహనాన్ని ప్రెసిడెంట్ రవిచంద్రన్ ఆదేశాల మేరకు జిల్లా వి215ఎ గవర్నర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం విజయవాడ పంపించారు.ఈ కార్యక్రమంలో శిఘాకొల్లి కరుణకుమార్, బోడా ప్రకాష్ ,మానేపల్లి రమేష్, ప్రశాంత్, రాఘవ, శ్రీనివాస్, రాజేష్, ప్రసాద్,కుమ్మర గుంట్ల వీరభద్రరావు పాల్గొన్నారు.

కడియం మండలవాసుల సాయం..

కడియం, సెప్టెంబరు 13 : వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండలం జేగురుపాడు గ్రామం నుంచి రూ.3,33,999 చెక్కును ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గారపాటి అమరనాథ్, పాతూరి రాజేష్, వెలుగుబంటి నాని, మర్రెడ్డి రమేష్, నాగిరెడ్డి రామకృష్ణ అందజేశారు. దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జమీ, టీడీపీ మైనారిటీ నాయకులు షేక్ సిద్ధయ్య, ధర్మాసనం శివ, నర్సరీరైతులు రూ.60 వేల విరాళాన్ని అందజేశారు. కడియం వెలుగుబంటి యూత్,రైసుమిల్లర్సు రూ.2,75,000 చెక్కును అందజేశారు. దుళ్ళ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.కడియం ఉన్నత పాఠశాల రెడ్‌క్రాస్ విద్యార్థులు సమకూర్చిన రూ.22,841ను పాఠశాల హెచ్‌ఎం టి.సత్యనారాయణ,ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అందజేశారు.

వృద్ధుడి పెద్దమనసు..

నిడదవోలు, సెప్టెంబరు 13 : సీఎం సహాయనిధికి ఒక మధ్య తరగతి వృద్ధుడు రూ.36 వేలు చెక్కును అందించాడు. నిడదవోలుకు చెందిన మద్దుకూరి నరసింహమూర్తి ప్రస్తుతం కర్ణాటకలో ఉంటున్నారు. ఇటీవల నిడదవోలు వచ్చిన ఆయన విజయవాడ వరదను చూసి చలించిపోయారు. ఈ మేరకు శుక్రవారం నిడదవోలు టీడీపీ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం రూ.36 వేల చెక్కును పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, భద్రం, దాసరి లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాలా రూ.లక్ష సాయం



గోపాలపురం, సెప్టెంబరు 13 : మండలం లోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస ఇండస్ట్రీ ఛైర్మన్ సాగిరాజు అభిమన్యరాజు వరద బాధితుల సహాయ నిధికి రూ.లక్ష చెక్కును నల్లజర్ల క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యే మద్దిపాటికి శుక్రవారం అందజేశారు.వరదబాధితులకు నియోజక వర్గ ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు.



రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి రూ.3,39,999 చెక్ అందజేస్తున్న జేగురుపాడు గ్రామస్తులు



నిడదవోలులో టీడీపీ పట్టణాధ్యక్షుడికి చెక్ అందజేస్తున్న వృద్ధుడు నరసింహామూర్తి



గోదారోళ్ల.. అభిమానం

గోదారోళ్ల అభిమానం అంటే ఇలా ఉంటది మరి.. ఎన్నికల్లో కూటమిగా జట్టు కట్టిన తర్వాత అనపర్తి సీటుపై తర్జనభర్జనలు సాగాయి. నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి సీటు వస్తే తులాభారం వేస్తామని అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలోని బల్లవంతెన విఘ్నేశ్వరుడి ఆలయంలో పడాల రామకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి వేర్వేరుగా మొక్కుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక్కొక్కరు 93 కిలోల బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు.. - అనపర్తి

ప్రావీణ్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రామ్మోహన్‌రావు

రాజానగరం, సెప్టెంబరు 13 : జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే విద్యలో ప్రావీణ్యం కనబర్చాలని ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జ్ ఛైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు యువ ఇంజనీర్లకు సూచించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో మేధ సాంకేతిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య రామ్మోహనరావు, ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం విజ్ఞాన సముపార్జనకు పెద్దగా శ్రమించాల్సిన అవసరంలేదని, అవకాశాలకు కొదవలేదని అందు బాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. యుక్త వయస్సులో సాధారణంగా వచ్చే భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితే విజయం సాధించడం సుసాధ్యమవు తుందన్నారు. మానవతా విలువలను విస్మరించకుండా, జన్మనిచ్చిన తల్లిదండ్రులు తమ కోసం చేస్తున్న త్యాగాలను మరచిపోవద్దని కోరారు. భారతరత్నం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా మేధ సాంకేతిక ఉత్సవాలను రెండు దశాబ్దాలుగా తమ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. యువ ఇంజనీర్లలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి పదునుపెట్టేందుకు మేధ వంటి సాంకేతిక విద్య ఉత్సవాలు మంచి వేదికలుగా నిలుస్తాయన్నారు. జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్కృతీసంప్రదాయాలను విలువలను పాటించడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో వస్త్ర ధారణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొలుత జీజీయూ ప్రాంగణంలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి రామ్మోహనరావు, ఛాన్సలర్ చైతన్యరాజు, చంద్రశేఖర్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, కేబీఆర్ వర్మ, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ టి.జయానంద కుమార్, ఎంవీఎస్‌బాబు, పి.జి.రామానుజం, మేధ కన్వీనర్లు బి.సుజాత, ఆర్.తమిళ్‌కోడి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా

నరేంద్రపురం నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర

28 ఏళ్లుగా వేంకటేశ్వరస్వామి మాలధారణతో తిరుమలకు వెళ్తున్న భక్తులు


సైకిళ్లపై తిరుమలకు బయలుదేరిన యాత్రికులకు జెండా ఊపుతున్న బత్తుల వెంకటలక్ష్మి

రాజానగరం, సెప్టెంబరు 13 : మండలంలోని నరేంద్రపురం గ్రామానికి చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు శుక్రవారం సైకిల్ యాత్ర చేపట్టారు. 28 ఏళ్లుగా ఏటా క్రమం తప్పకుండా వారం దరూ వేంకటేశ్వరస్వామి మాల ధరించి, దీక్ష పూర్తిచేసుకుని సైకిల్‌పై తిరుమలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం పరిపాటిగా మారింది. గ్రామానికి చెందిన ప్రగడ అంకాలు తన స్నేహితులతో కలిసి చేపడుతోన్న ఈ సైకిల్ యాత్ర 28 వసంతాలు పూర్తి చేసుకుంది. అంతేకాకుండా నరేంద్రపురంతో పాటుగా సీతానగరం, వెలుగుబంద, చెముడులంక గ్రామాల నుంచి 400 నుంచి 500 మంది భక్తులు ఏటా సెప్టెంబరులో సైకిల్ యాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజుల పాటు సాగే యాత్ర తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనంతో దీక్ష ముగుస్తుందని భక్తులు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నా సేన కోసం నావంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి దివాన్‌చెరువు వనువులమ్మ ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, నాయకులు యర్రంశెట్టి శ్రీను, చిట్టిప్రోలు సత్తిబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గట్టి రాంబాబు, ప్రగడ రాంబాబు, యర్రంశెట్టి తిరుమలేష్, తంగెళ్ల వీరబాబు, వంకా మల్లిబాబు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొని సైకిల్ యాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షించారు.

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా పాఠంశెట్టి బాధ్యతలు..


కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో నారాయణ మూర్తి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 13: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా పాఠంశెట్టి నారాయణ మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డివిజన్ డీఎల్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న పాఠంశెట్టికి ఇన్‌చార్జి సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కార్యాలయంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంతవరకు సీఈవోగా పని చేసిన ఎ.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా కాకినాడ వచ్చారు. తిరిగి మాతృశాఖ రెవెన్యూలో జీఏడీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. దీంతో సీఈవోగా ఆయన రిలీవ్ అయ్యారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి



ధవళేశ్వరం, సెప్టెంబరు 13 : రెండు రోజులుగా గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయానికి నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.ఆపై క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం సాయంత్రం ఆరు గంటలకు 12.20 అడుగులకు చేరుకుంది. 10,46,957 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చు. ఎగువన భద్రాచలంవద్ద తగ్గుతున్న నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 39.50 అడుగులుగా నమోదైంది.

విద్యార్థినులపై వేధింపులు

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 13: చిన్నారులకు విద్యాబోధనలు నేర్పించే ఉపాధ్యాయులే లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఏ బ్లాక్ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలో రెండో తరగతి ఉపాధ్యాయుడు సన్యాసిరావు ఐదో తరగతి విద్యార్థినులను శారీరకంగా వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడు తమ పిల్లలను శారీరకంగా వేధిస్తున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎస్పీ భవ్య విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సన్యాసిరావుపై బొమ్మూరు పోలీసులకు తల్లిండ్రులు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎంఈఓ తులసీదాస్ మాట్లడుతూ ఈసంఘటనపై విచారణ అనంతరం నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి తగు చర్యల కోఐసం పంపుతామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: కాకినాడ రూరల్ బీచ్ రోడ్డు చౌదరి గెస్ట్ హౌస్ వెనకాల గల సముద్రతీరంలో 50 ఏళ్లలోపు గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్టు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. మృతదేహంపై పచ్చరంగు జాకెట్టు ఎరుపు రంగు లంగా, మెడలో ఎరుపు రంగు తావీదు తాడు, తెలుపు, నలుపు రంగు జుట్టు కలిగి ఉందన్నారు. ఎడమ చేతికి ఆకుపచ్చ రంగు కలిగిన రెండు మట్టి గాజులు, కుడిచేతికి ఆకుపచ్చ, నీలం రంగు రెండు మట్టి గాజులు ఉన్నాయన్నారు. ఆచూకీ కోసం 0884-2306332, 9440796556 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు.

షోదార్పు యాత్ర..

- వరద బాధిత ప్రాంతాల్లో జగన్ మొక్కుబడి పర్యటన
- పేరుకే బాధితుల పరామర్శ.. ఎక్కడా బురదలో దిగని వైనం
- ముంపు గ్రామాల్లో పర్యటించకుండానే పైపై పలకరింపులతో సరి


నాగులాపల్లి వరద నీటిలో ట్రాక్టర్‌పై బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ సీఎం జగన్

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ పిఠాపురం, సెప్టెంబరు 13 : ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార తరహాలో పర్యటించడం విమర్శలకు దారితీసింది. వరద బాధితులకు ధైర్యం చెప్పడం మాటేమోగాని, ఎక్కడా వరద నీటిలోకి దిగకుండా, బాధితుల గోడు ఆలకించకుండా కేవలం నడిరోడ్డుపైనే వారిని నిలబెట్టి కారు ఎక్కి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అవాక్కవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఏలేరు వరదలకు నాలుగు నియోజకవర్గాల్లో తొమ్మిది మండలాల్లో 64 గ్రామాలు కకావికలం అయ్యాయి. వేలాదిమంది బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో వీరిని ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే మాజీ సీఎం జగన్ శుక్రవారం ఏలేరు బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. కానీ ఇది పరామర్శల తరహాలో కాకుండా ప్రచారంలా మారడం విశేషం. తొలుత ఉదయం 10.40 గంటలకు పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడి నుంచి చేరుగా పిఠాపురం మండలం మాధాపురం వెళ్లారు. అక్కడ వరద బాధితులు జగన్‌ను చూసి ముంపునకు గురైన తమ గ్రామంలోకి వచ్చి తమ కష్టాలు తెలుసుకోవాలని కోరారు. కానీ జగన్ మాత్రం గ్రామంలోకి వెళ్లడానికి ఇష్టపడ లేదు. దీంతో వారంతా నీరసించారు. కాగా దారిలో చిన్నచిన్న గ్రామాలున్నా వాటిలో ఎక్కడ వరద ప్రభావం లేదు. కానీ జగన్ మాత్రం ప్రతి చోటా ఆగి.. దారిపై ఉన్న వారందరినీ పలకరిస్తూ చేతులు ఊపారు. ముద్దులు పెడుతూ. తల నిమురుతూ ముందుకు సాగారు. దీంతో బాధితుల పర్యటన కంటే వరద ప్రభావం లేని ప్రాంతాల్లోనే జగన్ ఎక్కువ సేపు గడిపారు. ఆ తర్వాత పాత ఇసుకపల్లిలో ఆగి ప్రజలను పలకరించారు. ఆ తర్వాత జగన్ నాగులాపల్లి ముందు వంతెన కింద ఏలేరు వరదను పరిశీలించారు. ఆ తర్వాత నాగులాపల్లికి చేరుకున్నారు. కొందరు బాధితులు తమ గోడు వినాలని కోరగా, చేతికి ఉన్న వాచీ చూపించి సమయం లేదంటూ వెళ్లిపోయారు. అలాగే రమణక్కపేటకు మధ్యాహ్నం రెండున్నర దాటిన తర్వాత చేరుకున్న జగన్ అక్కడ రహదారిపై వరద ఎక్కువగా ఉందనే కారణంతో ట్రాక్టర్ ఎక్కి గ్రామంలో పరామర్శకు వెళ్లారు. తీరా అదే దారిలో పార్టీ నేతలు, కార్యకర్తలు నడుచుకుని వెళ్లారు. అక్కడ కూడా బాధితులతో మాట్లాడేందుకు పెద్దగా ఆసక్తి చూపని జగన్ వైసీపీ అధికారంలోకి లేకే ఇన్ని కష్టాలు వచ్చాయంటూ బాధితులకు చెప్పడం విశేషం. దీంతో వారంతా అవాక్కయ్యారు.

అందుకే అక్కడికి వెళ్లలేదు..

జగన్ గొల్లప్రోలు మండలంలో పర్యటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గొల్లప్రోలు ఏలేరు వరదతో తీవ్రంగా అతలాకుతలమైంది. దీనికి ప్రధాన కారణం ఏలేరు ఆధునీకరణ జరగకపోవడమే. అయితే జగన్ 2022లో గొల్లప్రోలు వచ్చినప్పుడు ఏలేరు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తానని చెప్పి చేయలేదు. దీంతో పనులు జరగలేదు. దీంతో ఇక్కడకు వస్తే జనం తిరగబడతారనే భయంతో జగన్ పెద్దగా వరద ప్రభావం లేని ప్రాంతాల్లో పర్యటించి మమ అనిపించారు. మరోపక్క జగన్ జిల్లాకు వచ్చినా మాజీ మంత్రులు వేణు, విశ్వరూప్ గైర్హాజరయ్యారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు కూడా ముఖం చాటేశారు. కాగా జగన్ పర్యటనలో పోలీసులు అతి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం

కొత్తపల్లి, సెప్టెంబరు 13: ఏలేరు వరదల కారణంగా నీట ముంపునకు గురైన కొత్తపల్లి మండలంలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి శుక్రవారం పర్యటించారు. జగన్‌కు బాణసంచాతో స్వాగతం పలికేందుకు నాగులాపల్లిలో వైసీపీ కార్యకర్తలు ఉర్రూతలూగారు. జగన్ ఇసుకపల్లి నుంచి నాగులాపల్లికి సమీపించేసరికి యువకులు ఒకటి రెండు తారాజువ్వలు పేల్చారు. ఇంతలో కొందరు మాజీ సీఎం వరద బాధితులను పరామర్శించే ందుకు వస్తున్న తరుణంలో బాణసంచా కాల్చడం సరి కాదని చెప్పడంతో కాల్చడం విరమించారు. నాగులాపల్లి పాటి మీద నుంచి రమణక్కపేట వెళ్లేందుకు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాక్టర్‌పై మాజీ సీఎం జగన్, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వైసీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి వెళ్లారు. వరద ముంపులో ఉన్న బాధితులకు నేటికీ ఎవరూ సాయం అందించలేదని పలువురు మహిళలు మాజీ సీఎంకు తెలిపారు. వరద బాధితులకు తక్షణం సాయం అందించే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని జగన్ బాధితులకు హామీ ఇచ్చారు.

డిజిటల్ మూల్యాంకన ప్రవేశపెట్టే దిశగా అడుగులు


ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రామ్మోహనరావును నన్నయలో సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 13 : డిజిటల్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టేదిశగా అడుగులు వేస్తున్నామని, పరీక్ష పత్రాల మూల్యాంకనం మరింత పారదర్శకంగా సాగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా కళాశాలలకు సంబంధించిన పలు విషయాలను అధికారులతో చర్చించారు. నాణ్యమైన ఉన్నతవిద్యను అందించేందుకు యాప్సీ లో వివిధ మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దానికి అనుగుణంగా విశ్వవిద్యాలయం పనిచేయాలని కోరారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ఐడీలను విద్యార్థులందరూ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో భద్రపరచుకుని, వాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా నన్నయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం రామ్మోహనరావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, విశ్వవిద్యాలయ అధికార్లు పాల్గొన్నారు.

'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ధ్రువపత్రం తప్పనిసరి'

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు13: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు సంతాన సాఫల్య కేంద్రాలు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం(ఎంటీపీ) ధ్రువపత్రాల అనుమతి తప్పనిసరిగా పొంది ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. రూరల్ మండలం బొమ్మూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంటీపీ యాక్ట్ పై శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, సంతానసాఫల్య కేంద్రాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంటీపీ అనుమతులు పొందిన సంతాన సాఫల్యకేంద్రాలు నిర్వహిస్తున్న ఆసుపత్రులు విధిగా ప్రతినెలా నిర్దేశించిన ఫార్మేట్‌లో నివేదికలను అందజేయాలన సూచించారు. ఎంటీపీ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించామని, వాటికి సంబంధించి ఆయా ఆసుపత్రులలో సీనియర్ డివిజనల్ అధికారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఆ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సంధ్య, కమిటీ సభ్యులు గైనకాలజిస్టులు డాక్టర్ టి.పద్మజ, సీహెచ్ శైలజ, ఎన్జీవో జి.మానస, పంచాయతీరాజ్ సిబ్బంది పి.శశాంక తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారయత్నం.. ఒకరికి ఏడేళ్ల జైలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 13: పద్దెనిమిదేళ్ల యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు డిస్ట్రిక్ట్-సెషన్స్ కోర్టు కం స్పెషల్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పు చెప్పారు. అమలాపురం తాలూకా సీఐ పి.వీరబాబు కథనం ప్రకారం... అమలాపురం రూరల్ మండలం సాకుర్రు గ్రామానికి చెందిన పద్దెనిమిదేళ్ల యువతి ఇంటర్ చదువుకుని తాతయ్య వద్ద ఉంటోంది. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లో ఆ యువతి వద్దకు నేలపూడి వీర వెంకట సత్యనారాయణ అలియాస్ గుండు వచ్చి ఆమెను కోరిక తీర్చమని వేధించాడు. లేకపోతే యాసిడ్ పోస్తానని హెచ్చరించాడు. ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆ యువతి కేకలు వేయడంతో ఆమె అమ్మమ్మతో పాటు చుట్టుపక్కలవారు పరుగున వచ్చారు. యువతి ఫిర్యాదు మేరకు అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎ.పరదేశి కేసు నమోదుచేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం సత్యనారాయణపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బెన్నయ్యనాయుడు తీర్పు చెప్పారు. ఈ కేసులో కృషి చేసిన అప్పటి ఎస్ఐ అందే పరదేశి, ఏఎస్ఐ ఆర్.గోపాలకృష్ణ, సీఐ పి.వీరబాబు, కోర్టు కానిస్టేబుల్ జి.సురేష్‌లను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 13: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, పిఠాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిండెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సునీత కోరారు.

కోత, కుట్లు లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

మెడికవర్‌లో 11 నెలల బాలుడికి అరుదైన వైద్యం

సామర్లకోట, సెప్టెంబరు 13: ఉభయగోదావరి జిల్లాలోనే తొలిసారిగా 11 నెలల బాలుడికి ఎటువంటి కుట్లు, కోత లేకుండా అత్యాధునిక ఆర్ఐఆర్ఎస్ ప్రక్రియ ద్వారా కిడ్నీలో రాళ్లను విజయవంతంగా తొలగించామని కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికోవర్ ఆసుపత్రి వైద్యబృందం శుక్రవారం వెల్లడించింది. కాకినాడ జిల్లాకు చెందిన ఒక బాలుడు కొన్ని నెలలుగా తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ, మూత్రం పోయడంలో తీవ్ర ఇబ్బంది పడుతుండగా గమనించి తల్లిదండ్రులు పలు ఆసుపత్రులు తిప్పినా ఎటువంటి ఫలితం లేకపోవడంతో తమ మెడికవర్ ఆసుపత్రికి చివరగా వచ్చారని యూరాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ మణికంఠ తెలిపారు. ఆ బాలుడికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించి వెంటనే సర్జరీ చేసి వాటిని తొలగించాలని బాలుడి తల్లిదండ్రులకు చెప్పామన్నారు. అత్యాధునిక ఆర్ఐఆర్ఎస్(రెట్రో గ్రేడ్ ఇంట్రారెనల్ సర్జరీ) ప్రక్రియ ద్వారా బాలుడి కిడ్నీలో రాళ్లను తొలగించి బాలుడిని మూడు రోజుల్లో పూర్తి ఆరోగ్యంగా ఇంటికి పంపామన్నారు. పోషకాహార లోపం, అధిక ఉప్పు వినియోగం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల భారతదేశంలో కిడ్నీ స్టోన్ వ్యాధి సాధారణమైతే.. నవజాత శిశువులలో దీనిని కనుగొనడం అతి అరుదని చెప్పారు. ఆర్ఐఆర్ఎస్ అనేది ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స అని ఇది మూత్ర నాళం నుంచి కిడ్నీ చేరుకోవడానికి అనుమతిస్తోందన్నారు. ఈ రకమైన విధానాలకు అనువైన యూరిటెరోస్కోప్ ఉపయోగించబడుతుందన్నారు. దీని తర్వాత చిన్న చిన్న రాళ్ల ముక్కలను కూడా పూర్తిగా తొలగించవచ్చన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి కోతలు, కుట్లు ఉండవన్నారు. రక్తస్రావం కూడా ఉండదన్నారు. అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ ఇది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని 11 నెలల బాలుడు కారణంగా మత్తు ఇవ్వడంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ సుభాకరరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ద్వారా బాలుడికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ మెడికోవర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యచికిత్సలు విజయవంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే గాకుండా అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారని డాక్టర్ కళ్యాణ్‌బాబు అన్నారు.

రోడ్డు ఫెన్సింగ్‌ను ఢీకొన్న బైక్

దంపతులకు తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి, సెప్టెంబరు 13: దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లజర్ల మండల చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు భార్య సంగీత, ఏడాది వయసున్న కుమారుడితో గోపాలపురం అత్తవారి ఇంటి వద్ద నుంచి చీపురుగూడెం స్వగ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. దేవరపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ అంబులెన్స్‌లో వీరిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరంప్రైవేటు ఆసుపత్రికి తరలించారు

పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం

తుని రూరల్, సెప్టెంబరు 13: కాకినాడ జిల్లా తుని మండలం లోవ కొత్తూరుశివారు పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గట్టుమీద చెప్పులు, కాలువలో మృత దేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామానికి చెందిన జిగిరెడ్డి శ్రీనివాసరావు(42)గా తెలిపారు. సంబంధిత వ్యక్తి సివిల్ కేసు విషయమై తుని వచ్చి, పని ముగించుకుని, రౌతులపూడి ఇంటికి వెళ్లే క్రమంలో పోలవరం కాలువలో మృతదేహంగా కనిపించడంపై మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


'క్రీడలతో మానసికోల్లాసం'


బ్యాడ్మింటన్ ఆడుతూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, సెప్టంబరు 13: క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతో పాటుగా ప్రత్యేకగుర్తింపు లభిస్తాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శుక్రవారం అన్నవరం జూనియర్ కళాశాల మైదానంలో అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల అండర్-19 బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్యాట్ చేతబట్టి కొద్దిసేపు బాల్‌బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచి తన చిన్ననాటి స్కూల్ గుర్తులను నెమరువేసుకున్నారు. అసోసియేషన్ ఛైర్మన్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ 13, 14, 15 తేదీలలో ఈపోటీలు నిర్వహించి వీరిలో ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర స్థాయి టీంగా ఎంపిక చేస్తామని, వీరు సెప్టంబరు 29 నుంచి 31 వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆడతారన్నారు. తొలిరోజు పోటీలలో విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల టీంలు బాలుర విభాగంలో విజయం సాధించగా, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖ, గుంటూరు, ప్రకాశం జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో టీడీపీ నేత యనమల రాజేష్ పాల్గొన్నారు. వీరభద్రస్వామి, సీతాపతిరావు, పాల్గొనగా పర్వత వీరేష్, కోళ్ల సూరిబాబు తదితరులు ఆంపైర్లగా వ్యవహరించారు.

సడన్.. సర్ప రైజ్..

మోతుగూడెం జెన్కో కాలనీలో కింగ్ కోబ్రా హల్‌చల్



మోతుగూడెం, సెప్టెంబరు13: మోతుగూడెం సెకండ్ రింగ్ రోడ్‌లో శుక్రవారం కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. పదిరోజులుగా కురిసిన వర్షాలకు, వరదలకు ఎటునుంచి వచ్చిందో తెలియదు కానీ రెండో రింగ్ రోడ్డులో సుమారు 10 అడుగులున్న కింగ్ కోబ్రా కనిపించడంతో ఈ ప్రాంతవాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ మధ్యకాలంలో కింగ్ కోబ్రా హల్‌చల్ చేయడం రెండోసారి. దీంతో చిన్న పిల్లలను భయటకు వదలాలంటేనే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి కింగ్ కోబ్రాను పట్టుకుని దూరంగా అడవిలో వదిలేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిచో పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలుపుతున్నారు.

ఏజెన్సీ సమాచారం



చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగ్గుతున్న వరద

● రోడ్లన్నీ బురదమయం

చింతూరు, సెప్టెంబరు 13: చింతూరు మండలంలో వరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. శుక్రవారం సాయంత్రానికి ఆంధ్ర ఒడిస్సాల నడుమ రాకపోకలు సాగే పరిస్థితిలేదు. నిమ్మలగూడెం, కుయుగూరుల నడుమ 30వ నెంబరు జాతీయ రహదారిపై ఇంకా వరద తగ్గకపోవడమే దీనికి కారణం. చింతూరు వరరామచంద్రవరం మండలాల నడుమ పరిస్థితి కూడా ఇదే తీరున ఉంది. చీకటివాగు, చంద్రవంక వాగులవద్ద ప్రధాన రహదారిపై వరద నీరు పూర్తిగా తగ్గలేదు. దీంతో ఆ దిశగా కూడా రాకపోకలు సాగడం లేదు. వరద తగ్గి బయటపడ్డ రహదార్లన్నీ బురదతో పేరుకుపోయాయి. పాడేరు, రంపచోడవరం నుంచి ఇక్కడకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహకారంతో రహదార్లపై బురద తొలగించే చర్యలు చేపట్టారు. తాజావరద కారణంగా చింతూరు డివిజన్‌లో 19766 కుటుంబాలు వరదబారిన పడ్డట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. బాధిత కుటుంబాలకు బియ్యం ఇతర నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది.

పరిహారం అందేలా చూస్తా : ఎమ్మెల్యే శిరీషదేవి

కూనవరం: పోలవరం ముంపు మండలాలకు త్వరలోనే పరిహారం అందేలా చేస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలో ఆమె పర్యటించారు. బొజ్జరాయిగూడెం, తాళ్లగొమ్ము, కోతులగుట్ట పునరావాస కేంద్రం, టేకులబోరు విజయభాస్కరకాలనీ, కూనవరం గిన్నెల బజారులో ఆమె పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఇక్కడ ప్రతీ సమస్య సీఎం చంద్రబాబు దగ్గరకు తీసుకువెళ్తున్నానని. ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తుందన్నారు. నిర్వాసితుడికి అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. అనంతరం కూనవరం యువత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తెలుగుయువత అధ్యక్షుడు మఠంభాస్కర్, బరపాటి ప్రకాశరావు, అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, చెలకాని ఉమామహేశ్వరరావు, పాయం వెంకయ్య, నోముల సత్యనారాయణ, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్లు పంపిణీ

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 13: మండలంలోని నాలుగు గ్రామాల వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. వరద ముంపు గ్రామాలైన కొటారిగొమ్ము, ఇప్పూరు, గుండుగూడెం, ధర్మతాళ్లగూడెం గ్రామాలలోని 284కుటుంబాలకు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి 1200 రూపాయలు విలువ చేసే కిట్లను అందించారు. ఈక్రమంలో వరద బాధితులు పోలవరం పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆమె మాట్లాడుతూ ఈప్రాంత పోలవరం నిర్వాసితులందరికీ నష్టపరిహారం ఇప్పించడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో ఫణీంద్ర, సీఐ కన్నపు రాజు, ఏఎస్ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్యశిబిరం

రంపచోడవరం, సెప్టెంబరు 13: రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద తెలిపారు. గుండెకు సంబంధించి వ్యాధులు, ఆయాసం, దడ, బీపీ, షుగరు, చెవి, ముక్కు గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పాటు స్త్రీలు, పిల్లల వ్యాధులకు వైద్యనిపుణులచే సేవలు అందించనున్నట్లు తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంటి పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేసి కళ్ళజోళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కంటిపరీక్షలకు వచ్చే వారు ఆధార్, తెల్ల రేషన్ కార్డులను తీసుకురావాలని సూచించారు.

సీపీఎం అగ్రనేతకు ఘన నివాళి

ఎటపాక, సెప్టెంబరు 13: సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాంకు సీపీఎం మండల కమిటీ ఘనంగా నివాళర్పించింది. శుక్రవారం ఎర్రబోరు గ్రామంలో పులుసు బాలకృష్ణ అధ్యక్షతన ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి ఐవీ మాట్లాడారు. ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. మండల కమిటీ సభ్యులు ఇరపా అజయ్, కాకా అర్జున్, ఐ.పద్మ, రత్తమ్మ, కారం జయమ్మ పాల్గొన్నారు.

చింతూరు: సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరికి శుక్రవారం చింతూరులో సీపీఎం మండల కమిటీ నివాళులర్పించింది. ఈ సందర్భంగా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, ముర్రం రంగమ్మ, సీసం సురేష్ తదితరులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏచూరి సేవలు, పోరాటాల తీరును గుర్తుచేశారు.

సంపూర్ణత అభియాన్‌పై అవగాహన

వై.రామవరం, సెప్టెంబర్ 13: నీతి ఆయోగ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని పైడిపుట్ట గ్రామంలో ఎంపీడీవో కె.బాపన్నదొర ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దీని ద్వారా గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు వంటి మౌలిక వసతులు కేంద్ర ప్రభుత్వ నిధులతో కల్పిస్తామని తెలిపారు. యార్లగడ్డ సర్పంచ్ పల్లాల పద్మావతి ఈపథకంవల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీడీవో బాపన్నదొర యార్లగడ్డ ఆశ్రమ పాఠశాల సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. అలాగే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పోషకాహార పదార్థాలపై పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి భార్గవచరణ్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వెలుగు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో సర్వసభ్య సమావేశం

దేవీపట్నం, సెప్టెంబర్ 13: మండలంలో ఇందుకూరుపేటలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలవరం నిర్వాసితుల సమస్యలు, కాలనీల్లో మౌలిక వసతులు, అంగన్వాడీలు, ఉపాధి హామీ తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రత్నకుమారి, తహసీల్దార్ రామకృష్ణ, ఆయా శాఖలాధికారులు, వైస్ ఎంపీపీ గారపాటి మురళీ, ఎంపీటీసీ జగదీష్, సర్పంచ్‌లు రాజామణి, నాగరత్నం, విజయ, లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఇసుక రవాణా

● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు

ఎటపాక, సెప్టెంబరు 13: గుండాల ఇసుక డంపు-1 నుంచి ఇసుక అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి రవాణా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నా యన్నారు. ఈక్రమంలో శుక్రవారం ఇసుక లోడ్ చేసి తరలిస్తున్న కొన్ని టిప్పర్లు భద్రాచలం వైపు యథేచ్ఛగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పేరుకు ఆంధ్రావైపుకు ఇసుక బుక్ చేసుకుని, ఆ ముసుగులో తెలంగాణకు రవాణా చేస్తున్నారు. ఇందులో భద్రాచలంకు చెందిన ఇసుక వ్యాపారస్తుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎటపాక మండలంలోని కన్నాయిగూడెం, చింతలగూడె, ఎటపాక గ్రామాలకు చెందిన ఇసుక లబ్ధిదారులతో పేరుతో ఇసుకను బుక్ చేసుకుని, అక్కడి నుంచి తెలంగాణకు తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే రాయనపేట సచివాలయంలో ఇసుక బుకింగ్‌కు డిజిటల్ లావాదేవీల ఇసుక అమ్మకాలు జరగాల్సి ఉండగా, కొందరు నేరుగా డబ్బులు చెల్లించి ఇసుక తరలించుకుపోతున్నట్లు తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు ఆరోపించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంను కొందరి భద్రాచలం ఇసుక వ్యాపారస్తులు జేబులు నింపుకుంటున్నారని అన్నారు. రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణ లోపం స్పష్టం కనబడుతుందని ఆరోపించారు. ఉచిత ఇసుక పాలసీని పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గోకవరం, సెప్టెంబరు 13: స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు.

'అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించండి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను అనంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, నష్టపరిహారం అందేలా కృషిచేయాలని కోరారు. ఎస్పీకి మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

17 నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు : కలెక్టర్



సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: జిల్లాలో ఈనెల 17 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం-2024పై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహించాలన్నారు. 18న స్వచ్ఛత పరుగులు, సైక్లాథాన్‌లు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమచికిత్స శిక్షణ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికుల గుర్తింపు, మంజూరైన పథకాలతో అనుసంధానం చేయాలన్నారు. 20న ప్లాంటేషన్ డ్రైవ్, 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కుల శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి పీపీఈ కిట్‌లు, సేఫ్టీ గేర్లు పంపిణీ నిర్వహించాలన్నారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత, 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగతరక్షణపై సఫాయి మిత్రలు వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 25న వీధినాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం, 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు, శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు, స్కాలర్‌షిప్‌ల అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. 27న గ్రామ, వార్డుసభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీస్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, స్ట్రీట్ క్లీని ంగ్ డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్‌మేనేజ్మెంట్ ఆస్తుల సుందరీకరణ, ఫుట్ పాత్‌లు, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాలసేకరణ, 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన అభయారణ్యాలు, జూ ప్రాంతాలు, బీచ్‌లు శుభ్రపరచడం, 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై విద్యాపబ్లిక్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్యబీమా నమోదులో సహకారం నిర్వహించాలన్నారు. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మానకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

పుష్కరాల సమయానికి రహదారుల అభివృద్ధి: ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, సెప్టెంబరు 13: వచ్చే పుష్కరాల సమయానికి పూర్తిస్థాయిలో రహదారులు అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గ్రామాలకు తాగునీరు, రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.34కోట్ల అంచనాలతో ఎన్ఆర్ఈజీఎస్ అనుసంధానంచేస్తూ పలు రహదారులను కలుపుతూ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన టి.సత్యనారాయణ, జేఎస్ఎస్‌వీ ప్రసాద్, సబ్బతి శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల స్టాలిన్, చెక్కపల్లి మురళి, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, ఎంపీడీవో కె.రత్నకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇదేమి అత్యవసర సమావేశం

●పిలిచి అవమానపరిచారని ఎంపీటీసీల అసహనం

గోకవరం, సెప్టెంబరు 13: అత్యవసర సమావేశమంటూ కేవలం ఒక రోజు ముందు సమాచారం అందించారు. రోజువారి పనులు పక్కనబెట్టి సమావేశానికి హడావిడిగా వెళ్లాం. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే తమకు ఏమీ తెలియ జేయకుండానే సమావేశం ముగిసిపోయిందంటూ చెప్పే శారు అంటూ పలువురు ఎంపీటీసీ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు ఎదురైన చేదు అనుభవం ఇది. మండలంలో ఇటీవల కురి సిన వర్షాలవల్ల నష్టపోయిన రైతుల సమస్యలపై చేప ట్టాల్సిన చర్యలు, ఇతర అంశాలపై చర్చించేందుకుగాను ఈసమావేశం ఏర్పాటు చేసినట్లు ముందుగా అధికారులు ప్రకటన చేశారు. ఎంపీపీ గదిలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ముందుగా లోపలికి వెళ్లిన కొంతమంది సభ్యులు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులతో ఆ చిన్నపాటి గది నిండిపోయింది. దీంతో మిగిలిన సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు బయటే ఉండిపోవాల్సిన పరిస్థితి ఎదురైంది. బయట ఉన్న వారికైతే లోపల ఏమి జరిగిందో, ఎందుకు రమ్మన్నారో, ఆ వెంటనే సమావేశం అయిపోయిందంటూ ఎందుకు చెప్పారో తెలియక మిన్నకుండి పోయారు. కొంతమంది సభ్యులైతే లోలోపల చీత్కరించుకుంటూ కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు వ్యవహరించిన తీరు సక్రమంగా లేదంటూ మెజార్టీ ప్రజాప్రతినిధులు విమర్శలకు దిగారు.

వరద బాధితులకు రూ.50వేలు విరాళం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 13: వరద బాధితుల సహాయార్థం రూ.50 వేలను సీఎం సహాయనిధికి అందజేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంక మల్లికార్జునస్వామి తెలిపారు. ఈమొత్తాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావుకు అందజేసినట్లు తెలిపారు.

ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు మందుల వితరణ

సీతానగరం, సెప్టెంబరు 13: తానా డైరెక్టర్ నిమ్మలపూడి జనార్ధన్ (యుఎస్ఏ) స్థాపించిన తారక్ ఫౌండేషన్ శుక్రవారం మిర్తిపాడు గ్రామంలోని ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు లక్ష రూపాయలు విలువచేసే అత్యవసర మందులను ఉచితంగా అందజేసింది. ఈ మందులను నిమ్మలపూడి గిరిధర్, సర్పంచ్ బంగారు సత్యవతి, ఉపసర్పంచ్ వాకలపూడి శ్రీరామకృష్ణ సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ చైతన్యకు అందజేశారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగికి మంచి గుర్తింపు

రంగంపేట, సెప్టెంబరు 13: అంకిత భావంతో పనిచేసే కె.రాంబాబు మాష్టారు నేటి ఉపాధ్యాయ యువలోకానికి ఆదర్శప్రాయుడని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ల అరుణ అన్నారు. శుక్రవారం చంద్రేడు ప్రాథమిక పాఠశాల పూర్వపు ఉపాధ్యాయుడు కొరమాటి రాంబాబుకు, ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ళ అరుణ ఆమె తల్లిదండ్రులు స్వర్గీయ గరిమెళ్ళ సుబ్బలక్ష్మి, జగన్నాథశాస్త్రి, సోదరుడు హరికృష్ణ స్మారకార్థం ఉత్తమఉపాధ్యాయ అవార్డును ప్రధానం చేశారు.

జనసేనలో చేరిన కోరుకొండ సర్పంచ్



ఎమ్మెల్యే బత్తుల సమక్షంలో జనసేనలో చేరిన కోరుకొండ సర్పంచ్

కోరుకొండ, సెప్టెంబరు13: మండలంలోని కోరుకొండ గ్రామసర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ ఆమె భర్త, పంచాయతీ వార్డు మెంబర్ అయిన కర్రి వీరగణేష్‌లు శుక్రవారం కోరుకొండలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కర్రి లక్ష్మీసరోజ వీరగణేష్‌లు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు పట్ల ఆకర్షితులయ్యామన్నారు. పార్టీలోకి వచ్చిన లక్ష్మీసరోజ వీరగణేష్‌లకు జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పూలమాలలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన తూర్పుగోదావరి జిల్లా నాయకులు అడ్డాల శివచక్రవర్తి, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు బదిరెడ్డి దొర, మండల శాఖ అధ్యక్షుడు అడ్డాల శ్రీను, గాదం శెట్టి వెంకన్న, కటకంచలం, తెలగంశెట్టి శివ, సుంకర శ్రీను, వసుపులేటి శివ, పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఇటీవల బురద కాలువ వరద తాకిడికిగురై సర్వం కోల్పోయిన మండలంలోని శ్రీరంగపట్నం, ఎస్టీ కాలనీవాసులకు జనసేన పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గ్రామసర్పంచ్ మద్దాల రమణ, మాజీ ఎంపీపీలు బదిరెడ్డి రాజా,బుద్దా బాపుజీ, జనసేన నాయకుడు తన్నీరు తాతాజీ, దొడ్డి అప్పలరాజు, గొల్లకూటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు పలు అర్జీలు

కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంవద్ద శుక్రవారం తమ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలంటూ పలు గ్రామాలకు చెందిన ప్రజానీకం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వినతిపత్రాలు అందజేశారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ మండలాల నుంచి తరలి వచ్చిన జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

గణపతికి సినీనటుడు కాశీవిశ్వనాథ్ పూజలు

సీతానగరం, సెప్టెంబరు 13: ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు యనమదల కాశీవిశ్వనాథ్ శుక్రవారం రఘుదేవపురంలోని చెరువుగట్టు వద్ద వినాయకుడి ఆలయం సమీపంలో శ్రీ పార్వతీ తనయ గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సినీ దర్శకుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గణపతికి పూజలు నిర్వహిండం గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు.

జగన్‌ది బురద రాజకీయం

● అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13: వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారిని ఆదుకోవాల్సింది పోయి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లుతూ రాజకీయం చేస్తున్నారని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ఎలాంటి సహాయం చేయని జగన్మోహనరెడ్డికి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. తన ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు హెలీకాప్టర్ ఎక్కి గాల్లో చక్కర్లు కొట్టడం తప్ప నేలపై ఎప్పుడూ ప్రజల కష్టాలు పట్టించుకోలేదని విమర్శించారు. కృష్ణా నదీ ప్రవాహంలో టన్నుల బరువున్న పడవలను వదలడం ద్వారా వరద బీభత్సం సృష్టించాలని చేసిన జగన్ కుట్ర బయటపడిందన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమని, ఒక్క బడ్జెట్‌లోనే రాష్ట్రానికి కేంద్రం రూ.50వేల కోట్లకు పైగా ప్రయోజనాలు అందించారని, కాంగ్రెస్ హయాంలో ఏనాడైనా రాష్ట్రానికి ఇంత భారీ సాయం చేశారా అని ప్రశ్నించారు. ఎంపీ పురందేశ్వరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడంలేదనే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, బీజేపీ సభ్యత్వ నమోదుకు దక్షిణాదిలోని మూడు రాష్ట్రాలకు ఆమె బాధ్యులుగా ఉన్నారని, పార్లమెంట్ సెషన్స్‌కు హాజరవుతూ ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

సేవా పక్వాడ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరిం చుకుని దేశవ్యాప్తంగా పక్షం రోజులపాటు నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఏపీ సేవా పక్వాడ్ కమిటీలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డికి చోటు లభించింది. ఏపీ నుంచి నల్లమిల్లితో పాటు రెడ్డి పావని, పాటిబండ్ల రామకృష్ణ, గుడిసె దేవా నంద్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

వరదలకు నష్టపోయిన వారిని ఆదుకుంటాం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటా మని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇటీవల భారీ వర్షాలకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఐదు కుటుంబాల వారికి బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎమ్‌పీడీవో హిమ మహేశ్వరి, ఈవోపీఆర్‌డీ పద్మజ, కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సర్పంచ్‌లు గంగాభవాని, హేమతులసి, భాస్కరరెడ్డి, మల్లిడి శ్రీని వాసరెడ్డి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగంపల్లిలో 50 కుటుంబాలు బీజేపీలో చేరిక

రంగంపేట: బీజేపీ బలోపేతానికి ప్రతీకార్యకర్త కృషిచేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రంగంపేట మండలం సింగంపల్లిలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమో దు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సింగంపల్లి గ్రామంలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అనాథలకు అండగా మిషన్ వాత్సల్య'

తల్లిదండ్రులు కోల్పోయి బంధువుల సంరక్షణలో పెరుగుతున్న చిన్నారులకు చేయూ త అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్‌వాత్సల్య' పథకాన్ని ప్రవేశపెట్టిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలో 'మిషన్ వాత్సల్య' పేరుతో కొప్పిరెడ్డి జశ్వంతి,గురుమూరి గగన్, పడాల గోపాల పవన్‌కు ఒక్కొక్కరికి నెలకు రూ.4వేల చొప్పున ఆరునెలలకు రూ.24 వేలు అందజేశారు. అనంతరం సింగంపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన కొండేం భూషణం, కొండేం పుష్పావతి, రెండు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

బిక్కవోలు: పందలపాకలో ముగ్గురికి మిషన్ వాత్సల్య పథకం మంజూరు పత్రాలను శుక్రవారం కూటమి నేతలు అందజేశారు. వీరిలో షేక్ వహీదా, కోరాడ నవీన్‌కుమార్, నులుకుర్తి జోష్‌వినయ్‌సంపత్ ఉన్నారు. వీరికి నెలకు రూ.4వేలు చొప్పున ఆరునెలలకు రూ.24వేలు అందిస్తున్నామని సర్పంచ్ పద్మావతి, ఉపసర్పంచ్ వెంకటరామారెడ్డి తెలిపారు.

రాజమండ్రి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు

త్వరగా పూర్తి చేయాలి

● రైల్వే అధికారులతో ఎంపీ పురందేశ్వరి



డీఆర్ఎం పాటిల్‌కి లేఖను అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో చేపట్టే రాజమండ్రి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని రైల్వే ఉన్నతాధికారులతో ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని డివిజనల్ కార్యాలయంలో డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, బ్రాంచి అధికారులు ఆమెకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్మాణాల గురించి వివరించారు. ఈ సం దర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైల్వే అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ విషయమై నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. అత్యున్నత ప్రమాణాలతో రైల్వేస్టేషన్‌ని అభివృద్ధి చేయాలన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడానికి రూ.284.88కోట్లతో అంచనాలను రూపొందించినట్టు చెప్పారు. అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరు, తూర్పువైపు స్టేషను అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన భూమి తదితర విషయాలపై ప్రత్యేకంగా ఈ సమావేశంలో దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పీఈ ఎడ్విన్, గతిశక్తి సీపీఎం విఠల్, సీనియర్ డీసీఎం రాంబాబు పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్ సీఐగా బాజీలాల్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ నరసింహ కిషోర్‌ని కలిసిన సీఐ బాజీలాల్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్ సీఐగా ఆర్ఎస్‌కే బాజీలాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ నరసింహ కిషోర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కొద్దిరోజులుగా ఖాళీగా ఉన్న ఈస్థానంలో బాజీలాల్ నియమితులయ్యారు. గతంలో ఇదే స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తించిన అనుభవం ఆయనకు ఉంది. గంజాయి అక్రమ రవాణా, బ్లేడ్‌బ్యాచ్‌లు, అసాంఘిక వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతలకు, సాధారణ ప్రజాజీవనానికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమన్నారు. మహిళలు, పిల్లల భద్ర తపై దృష్టి సారిస్తామని చెప్పారు. బాజీలాల్‌కు స్టేషన్‌లోని సిబ్బంది అభినందనలు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13: రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈనెల 27న దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మె సందర్భంగా ఈ నిరసన చేపట్టినట్టు బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీపతిరావు తెలిపారు. ఉద్యోగులకు ఇబ్బంది కలిగేలా యాజమాన్యాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల బ్యాంకులో అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కొత్త ఉద్యోగాల నియామకం లేకపోవడంతో పనిభారం పెరగడం, తాత్కాలిక ఉద్యోగులకు శాశ్వత నియామకాలు చేపట్టకపోవడం, బ్యాంకుల్లో ఏర్పడే సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులను పక్కనబెట్టి కార్పొరేట్ ఏజెన్సీల సలహాలు పాటించడం తదితర అనేక సమస్యలపై ఒకరోజు సమ్మెకు వెళుతున్నామని తెలిపారు. ఆఫీసరు యూనియన్ సంఘం నాయకులు, ఉద్యోగుల సంఘం నాయకులు స్వాతి, డీవీ ప్రసాద్, ఎంఎస్ఎన్ రాజు, మురళీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో కిషోర్, ప్రకాష్, వంశీ, గౌతమ్, అశోక్, వెంకటేశ్వరరావు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

'బిల్లు తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగించే ప్రతిఒక్కరూ బిల్ చెక్ చేసుకుని వారి సెల్ నెంబరుకు వచ్చే ఓటీపీ చెప్పి ఆటుపై గ్యాస్ సిలెండర్‌ను తీసుకోవాలని జిల్లా ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిడి అప్పాజి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆయన గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను కలిసి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ విధానాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా చేపట్టిందని, ప్రతి వినియోగదారుడు డెలివరీ బాయ్‌కు ఓటీపీ చెప్పి గ్యాస్ సిలెండరును పొందాలన్నారు. బిల్లులను సరిచూసుకొని తద్వారా తమ చెల్లింపులు జరపాలన్నారు. ఇప్పటి దాకా ప్రతి వినియోగదారుడు ఐవీఆర్ఎస్ 96660 23456 నెంబరు ద్వారా గ్యాస్ బుక్ చేసుకునేవారని, ఇప్పుడు ప్రభుత్వం 88888 23456 కొత్త నెంబరును ప్రవేశపెట్టిందని, ఈ నెంబరు ద్వారా కూడా మీ గ్యాస్ బుకింగ్‌లు జరుపుకోవచ్చని చెప్పారు. హెచ్‌పీపే యాప్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చని అప్పాజి చెప్పారు.

నందిగామలో న్యాయవాదిపై దాడికి నిరసన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: నందిగామలో న్యాయవాది ఎరగాని వీరబాబు, ఆయన కుటుంబ సభ్యులపైన జరిగిన దాడికి నిరసనగా రాజమహేంద్రవరంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ధర్నా చేసింది. శుక్రవారం జిల్లా కోర్టు సమీపంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి బీర అరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్నాలకోట వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశి శ్రీనివాసరావు, సీనియర్ దాసరి అమ్ములు మాట్లాడారు. సమాజ పరిరక్షణకు పాటుపడే న్యాయవాదులపై దాడులు జరగడం అమానుషమని, న్యాయవాదులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. వారికి రక్షణచట్టం చేయాలన్నారు. వీరబాబుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కుంచె రాంబాబు, పి.లక్ష్మీనాగేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ, సబ్బెళ్ళ సోమిరెడ్డి, కళ్యాణ్ దొర, సజ్జ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13: విద్యార్థులు తమతోపాటు పరిసరాలు, తాము చదువుతున్న విద్యాలయంపట్ల సరైన అవగాహన ఉన్నప్పుడే తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీఎల్ రాజబాబు అన్నారు. దీక్షరంబ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతు లు సమాజ శ్రేయస్సు, ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులు కూడా చదువుకోవాలనే లక్ష్యంతో అతి తక్కువ ఫీజులతో, ఉన్నత ప్రమాణాలతో ఈ కళాశాలను స్థాపించారన్నారు. కోర్స్ కోర్డినేటర్ జి.శరత్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగపరచుకొని విద్యలో రాణించాలను కోరారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు, ప్రముఖ వ్యక్తిత్వ వికాసనిపుణుడు జి.నాగిరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత ఆత్రేయ వర్ధంతి




సినీ గేయ రచయిత ఆత్రేయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13: మనిషి, మనసు, మమత,ప్రేమ తన కవితా వస్తువులుగా ఏర్చి కూర్చి, తెలుగు ప్రజల గుండెల్లో పదికాలాలపాటు చిరస్థాయిగా నిలిచిపోయే పాటలను మనకందించిన మనసున్న కవి ఆచార్య ఆత్రేయ అని తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు అన్నారు. శుక్రవారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో తెలుగుశాఖ, తెలుగు సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్రేయ వర్ధంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏబీఎల్ రాజబాబు మాట్లాడుతూ ఆత్రేయ కలం నుంచి వచ్చిన పాటలన్నీ తాత్విక ధోరణితో, జీవితతత్వాన్ని గుట్టు విప్పి జీవితాన్ని కాచి వడపోసిన నగ్న సత్యాలేనని అన్నారు. టీసీ రత్నం మాట్లాడుతూ 4000 సినిమాల్లో దాదాపు 35000పైగా పాటలు రాశారన్నారు. పూర్వవిద్యార్థి సంఘ నాయకుడు చర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

బిక్కవోలు, సెప్టెంబరు 13: మండలంలోని గ్రామాల్లోను ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకూ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఈనెల 15 నుంచి 20 వరకూ సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ. ఝాన్సీ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఏపీవో అగస్టీన్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది రూ.11కోట్లతో 1880 పనులు చేపట్టామన్నారు. గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తయిన తరువాత మండలస్థాయిలో ఈనెల 21 సామాజిక తనిఖీల నివేదికలు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరిస్తారన్నారు.



చిక్కదు..దొరకదు : గురువారం రాత్రి అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



సర్కారు దవాఖానా.. సమస్యలు చానా!

బోధనాసుపత్రికి..బోలెడు సమస్యలు

- అందని పూర్తిస్థాయి వైద్యం
- ప్రతి రోజూ ఓపీ 1100
- భవనం లేదు..సిబ్బందీ కొరత
- రేడియాలజిస్టు పోస్టులు ఖాళీ
- మందకొడిగా కాలేజీ పనులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 : రాజమహేంద్రవరం బోధనాసుపత్రి (జీజీహెచ్)లో బోలెడన్ని సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆసుపత్రి స్థాయికి తగినట్టుగా పూర్తిస్థాయి సౌకర్యాలతో ప్రధాన భవనం లేకపోవడం వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరోపక్క వైద్యులు, పారామెడికల్, మినిస్టీరియల్ సిబ్బంది కొరత వేధిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ తీసుకొచ్చామంటూ ఊకదంపుడు ప్రచారం చేసుకుని కీలకమైన బోధనాసుపత్రిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇక మెడికల్ కాలేజీ పనులు అయినా ముందుకు సాగుతున్నాయా అంటే అదీ లేదు. కేవలం 25 శాతం పనులు మాత్రమే జరిగాయి.

సీటీ ఉంది..రేడియాలజిస్ట్ లేరు..

జీజీహెచ్‌లో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రా సౌండ్ వంటి క్రిటికల్ డయాగ్నసిస్ యంత్రాలు ఉన్నాయి. రోగికి వ్యాధి నిర్ధారణలో ఈ మూడు విభాగాలు అత్యంత కీలకం. జబ్బును బట్టి ఆయా విభాగాల్లో స్కానింగ్ పరీక్షలు జరుగుతుంటాయి. అయితే సీటీస్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయడానికి రేడియాలజిస్ట్‌లు లేకపోవడం గమనార్హం. రేడియాలజీ విభాగానికి హెచ్‌వోడీగా ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండాలి. అయితే ఒక్కరూ కూడా లేరు. రేడియాలజిస్ట్‌లు లేకపోవడంతో బోధనాసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందడంలేదు. అల్ట్రాసౌండ్, సీటీ కోసం రేడియాలజిస్ట్‌లను తాత్కాలికంగా తీసుకొస్తున్నా ఏదో మొక్కుబడిగానే సేవలందుతున్నాయనే విమర్శలున్నాయి.కొన్ని కీలకమైన విభాగాలకు ఇంకా ఎక్విప్‌మెంట్ రావాల్సి ఉంది. న్యూరో సర్జికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో లేదు.



650 బెడ్స్ ఏర్పాటు ఎలా?

బోధనాసుపత్రిలో రోగుల బెడ్స్ సంఖ్య 650కి పెంచాలని జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 350 శాంక్షన్ బెడ్స్‌తో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. అరకొర సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది కొరతతో నెట్టుకొస్తున్న ఈ తరుణంలో బెడ్స్ పెంచాలంటే ఎలా అంటూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.మెయిన్ బిల్డింగ్ అందుబాటులోకి వస్తే ఈ సమస్య చాలా వరకూ తీరే అవకాశం ఉంది. జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఓపీ 1100 నుంచి 1400 వరకూ ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో బెడ్స్ పెంచాలనే ప్రతిపాదన తప్పనిసరిగా మారింది.

వైద్యులు, సిబ్బందీ కొరత ...

మరో పక్క జీజీహెచ్‌లో కొన్ని విభాగాలకు డాక్టర్స్ కొరత వేధిస్తోంది. జనరల్ మెడిసిన్‌కు మరింత మంది డాక్టర్లు అవసరం ఉంది. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలి. ఆప్తమాలజీ విభాగంలోనూ ఒక్కరే ఉన్నారు. కొత్త జీవో ప్రకారం స్టాఫ్‌ను నియమించాల్సి ఉన్నా ఇంకా పూర్తికాలేదు. ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు (ఎస్ఆర్)లు రావాల్సి ఉన్నా ఒక్కరు కూడా లేరు. స్టాఫ్ నర్సుల అవసరం చాలా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. జీజీహెచ్‌కు మినిస్టీరియల్, పారామెడికల్ అందరూ కలిపి 484 మందిని ఎలాట్ చేయగా ఇందులో 180 మంది స్టాఫ్ కొరత ఉండడం గమనార్హం.

నేడు ఆసుపత్రిని సందర్శనకు మంత్రి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం రాజమహేంద్రవరం బోధనాసుపత్రిని సందర్శించనున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, సమస్యలపై జిల్లా అధికారులు, ఆసుపత్రి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మెడికల్ కాలేజీ పనుల పురోగతిపైనా ఆయన రివ్యూ చేసే అవకాశం ఉంది. దీంతో మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి అధికారులు అన్ని వివరాలతో సమీక్షకు సిద్ధమవుతున్నారు.

దీవించు లక్ష్మీగణేశా!



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 13 : జిల్లాలో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. కమిటీ సభ్యులు తమ శక్తి మేరకు కార్యక్రమాలు చేస్తున్నారు. నాళం భీమరాజు వీధిలోని సిద్ధి లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శుక్రవారం డాల్లా మురళి లలిత దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి కుంకుమార్చన వైభవంగా చేశారు. ఏకంగా 3 వేల మంది మహిళలు హాజరై అమ్మవారికి పసుపు,కుంకుమ, 108 శ్రీకూర్మం ప్రతిమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా పూజ చేస్తే అష్టయిశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. అనంతరం 108 శ్రీకూర్మం ప్రతిమలను ఆయా భక్తులకే అందజేయడం విశేషం. ఆలయ కమిటీ సభ్యులు మాటూరి రంగారావు,శెట్టి జగదీష్,మాటూరి సిద్దు, మద్ది నారాయణరావు, నల్లం ఆనంద్, భ్రింగ్‌మళ్ళ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పట్టుకోండి.. చూద్దాం!?

చిక్కని చిరుత

తొలిసారి కనిపించింది ఇక్కడే : అటవీ ప్రాంతానికి ఎదురుగా ఉన్న నివాసం

- ట్రాప్ కెమెరాకు రోజూ ఫోజు
- వారమైనా ఇంకా కానరాని జాడ
- హైవేకు 5 కి.మీ పరిధిలోనే సంచారం
- ప్రకటనలకే అధికారులు పరిమితం
- జనానికి దినదిన గండం
- అటవీ ప్రాంతం వద్ద రక్షణ చర్యల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అటవీ అధికారులకు చిరుత పులి వారం నుంచీ సవాల్ విసురుతుంది. రాజమహేంద్రవరం శివారు రిజర్వు ఫారెస్టులోకి సరిగ్గా వినాయక చవితి ముందు రోజు 6న తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో ప్రవేశించి వారమైనా నేటి వరకూ చిక్క లేదు. నాటి నుంచి రోజూ ఫొటోకు పోజులిచ్చి చక్కా తిరుగుతుంది.ట్రాప్, సీసీ కెమె రాలు, పాద ముద్రల అంచనా.. చివరికి డ్రోన్ కెమెరాను రంగంలోకి దింపినా ఫలితం కాన రావడం లేదు. రిజర్వు ఫారెస్టును నివాసం ఉండే జనాలకు కంటిపై కునుకు ఉండడం లేదు. ఇక చిరుత దయతలచి బోనులో దూరడమో లేక ఇక్కడి నుంచి జారుకోవడమో చేసే వరకూ చూస్తూ ఉండడమే తప్ప చేసేదేమీ లేదనే ధోరణికి అధికారులు దాదాపుగా వచ్చేశారు. గతంలో ప్రత్తిపాడు ప్రాంతంలో చిరుత పులి సంచరించి నప్పుడు అధికారుల హడావుడే పైచేయి సాధించింది.పులి మాత్రం జనాలపై జాలిపడి వనానికి వెళ్లిపోయింది. ఇప్పుడూ అదే పరిస్థితి రావాలేమో.

5 కిలోమీటర్ల పరిధిలో తిరిగినా?

మూడునాలుగేళ్ల మగ చిరుతపులిగా నిర్ధారణకు వచ్చారు. బరువు సుమారు 70 కిలోలుగా అంచనా వేశారు. వేటాడే సామర్థ్యం అధికం. ఇప్పటి వరకూ మనుషుల జోలికి రాకపోయినా..ఇకపై రాదని స్పష్టంగా భరోసా ఇవ్వలేం. చిరుత 5 కిలోమీటర్ల పరిధిలోనే సం చరిస్తోందని అంచనా.లాలాచెరువు దాటిన తర్వాత రోడ్డును దాటుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చిరుత సంచరిస్తున్న రిజర్వు ఫారెస్టులో అడవి పందులు,నాటు పందులు, కోతులు, ముళ్ల పందులు, కుక్కలు ఉండడంతో ఆహారం పుష్కలంగా లభిస్తోంది. చిరుత ఒకసారి వేటాడి రెండు రోజులపాటు ఆరగిస్తుంది.

ప్రయత్న లోపమే.. పులికి వరమా?

జిల్లా డీఎఫ్‌వో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కాకినాడ జిల్లా అటవీ అధికారి(డీఎఫ్‌వో) తూర్పు గోదావరి ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా భరణి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె నేతృత్వంలో సుమారు 50 మంది బృందాలుగా ఏర్పడి చిరుత కోసం అన్వేషిస్తున్నారు. కానీ ఫలితం ఏమీ లేదు. 530 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో 50 వరకూ ట్రాప్ కెమెరాలను, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను చెట్లకు బిగించారు. ఇవి ఫొటోలు తీస్తాయి. అటవీ సిబ్బంది వెళ్లి ఆ కెమెరాలను పరిశీలిస్తే గానీ పులి ఫొటోలు బయటకు రావు. కేవలం నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆ కెమెరాలను డీఎఫ్‌వో సెల్‌కి లింక్ చేశారు. కెమెరా ఫుటేజీని తరచుగా పరిశీలించే సమయం డీఎఫ్‌వోకి ఉండదు.థర్మల్ కెమెరాతో డ్రోన్‌ని రంగంలోకి దింపారు. ఈ కెమెరాకు ఒకసారి చార్జింగ్ చేస్తే 45 నిమిషాలపాటు మాత్రమే వాడుకొనే వీలుంది.జీవి శరీర ఉష్ణోగ్రత ఆధారంగా ఇది ఫొటోలు లేదా వీడియోలు తీస్తుంది.దానిని తర్వాత పరిశీలించుకొని ఫుటేజీ దాచుకోవడం తప్పచేసేదేమీ ఉండదు.పులి దయతలచి అటవీ అధికారులు ఏర్పాటు చేసిన బోనులోకి వెళితేగానీ ఏమీ చేయలేని పరిస్థితి.

చిరుత పులిని పట్టుకుంటాం : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు : దివాన్‌చెరువు అటవీప్రాంతంలోనే చిరుతపులి ఉందని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీప్రాంతంలో అమ ర్చిన ట్రాప్ కెమెరాల్లో గురువారం చిరుతపులి సిత్రాలు కనపడ్డా యన్నారు. చిరుతపులిని ఖచ్చితంగా పట్టుకుంటామన్నారు. దివాన్ చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని జాతీయ రహదారిపై వేగ నియంత్రణ బోర్డులు, చిరుత పులి సంచరించే ప్రాంతం అని తెలిపే బోర్డు హైవేపై ఏర్పాటు చేయించామన్నారు.అయితే లాలాచెరువు వద్ద ఒకే ఒక బోర్డు ఏర్పాటు చేసి వదిలేయడంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ మాటలే..రక్షణ చర్యల్లేవ్..

ఒడ్డున కూర్చొని ఎన్ని మాటలైనా చెప్పొచ్చు.. నీట మునిగే వాడికే దడ పుడుతుందంటారు పెద్దలు. ఇప్పుడు చిరుత విషయం లోనూ అధికారుల తీరు అలాగే ఉందనే చర్చ నడుస్తోంది. రిజర్వు ఫారెస్టును ఆనుకొని ఉన్న శ్రీరాంపురం, తారకరామానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రూపానగర్, పద్మావతినగర్, ఆకాశవాణి రిలే కేంద్రం పరిసరాలు, ఆటోనగర్, దివాన్‌చెరువు తదితర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీ ప్రాంతంలో ఆవాసాల వాళ్లు వ్యర్థాలను ఇంటి బయట పడేయవద్దని.. ఇంటి వద్ద తగు లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే ఆయా ఆవాసాల ప్రజల నుంచి వ్యర్థాలను సేకరించే ఏర్పాటు లేదు. దీంతో బయట పారేయడం తప్ప మరో మార్గం లేదు.ఇళ్ల వద్ద లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సెలవిచ్చిన అధికారులు లాలాచెరువు దాటిన తర్వాత ఆటోనగర్ వరకూ తగు లైటింగ్ ఏర్పాటు చేయడం మరిచారు.ఇక్కడ చెట్లు గుబురుగా ఉండడంతో కాస్త చల్లగా ఉంటుందని వాహనదారులు పగలు, రాత్రి వేళల్లో కాసేపు ఆగుతుంటారు. వీరిని హెచ్చరించే విధంగా ఏర్పాట్లు చేయలేదు. కరపత్రాలు పంచిపెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా కనీస రక్షణ చర్యలు లేక అత్యవసర పనులు ఉన్నా బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఇప్పుడు చిరుతను సురక్షితంగా పట్టుకోవడం ఎంత ముఖ్యమో.. ప్రజలు దాని బారిన పడకుండా కాపాడడం అంతే ముఖ్యం. సీసీ కెమెరాలను ఎక్కువగా ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కంట్రోల్ రూంకి అనుసంధానించి నిరంతర నిఘా పెడితే ఫలితం ఉండొచ్చు. చిరుత సంచరిస్తోందని అంచనాకు వచ్చిన ప్రదేశాల్లో మాటు వేసి కంట్రోల్‌లోని ఫుటేజీలో కనబడిన వెంటనే చేరుకోగలిగితే చిరుత చిక్కే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



గోదారి వరద హెచ్చరికలు ఉపసంహరణ

సాధారణస్థాయికి చేరిన నీటిమట్టం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భయపెట్టిన గోదావరి తగ్గుముఖం పట్టింది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం రాత్రి 12 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.10 అడుగులగా ఉంది. బ్యారేజి నుంచి 10,33,672 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఇదిలా ఉండగా రాత్రి 12 గంటలకు బ్యారేజీ నీటిమట్టం 11.70 అడుగులకు పడిపోయింది. బ్యారేజీ నుంచి 9,81,043 క్యూసెక్కులు విడుదల చేయడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. గోదావరి శాంతించడంతో పరీవాహక ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం వద్ద రాత్రి 7 గంటల నుంచి వరద తగ్గుముఖం పట్టి నీటిమట్టం 39.40 అడుగులుగా ఉంది. ఆదివారం నాటికి అఖండగోదావరి, కోన సీమ లంకల్లోవరద నీరు బాగా లాగే అవకాశం ఉంది.



విద్యార్థినికి టంగుటూరి అవార్డు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నేటి నాయకులకు ఆదర్శం టంగుటూరి : దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13 : టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎంతో ఆదర్శమైనదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రకేసరి టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవానికి హాజరై మాట్లాడారు. నేటితరం రాజకీయనాయకులకు టంగుటూరి జీవితం ఒక ఆదర్శప్రాయం అన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసినా కూడా ఒక సాధారణమైన జీవితాన్ని చిట్టచివరి వరకూ గడిపారన్నారు. అలాంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులందరూ చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుని పీజీ సెట్ పరీక్షలో 1 నుంచి 100లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు టంగుటూరి పేరున అవార్డులు అందజేశారు. నవంబరు 7, 8 తేదీల్లో ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబోయే అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, ఉపాధ్యక్షులు శ్రీరామమూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ముళ్ల మాధవ్, గడ్డె సుధాకర్ పాల్గొన్నారు.

సాయం చేసే చేతులు..

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న.. ప్రస్తుతం అందరూ ఇదే చేస్తున్నారు..విజయవాడలో వరద నుంచి బయటపడిన బాధితులకు తలోకొంత సాయం అంద జేస్తున్నారు. కొంత మంది నగదు రూపేణా సీఎం సహాయ నిధికి అందజేస్తుంటే..మరికొంత మంది వస్తు రూపేణా అందజేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13 : విజయవాడ బుడమేరు వరద బాధిత ప్రజలకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రూ.3 లక్షలు విలువ చేసే సామాగ్రిని అందించారు. 600 దుప్పట్లు, 600 చీరలు, 600 తువ్వాళ్ళు, 300 స్టీల్ ప్లేట్స్, 300 స్టీల్ గ్లాసులు, నోట్ బుక్స్, స్టేషనరీ సామన్లుతో కూడిన వాహనాన్ని ప్రెసిడెంట్ రవిచంద్రన్ ఆదేశాల మేరకు జిల్లా వి215ఎ గవర్నర్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం విజయవాడ పంపించారు.ఈ కార్యక్రమంలో శిఘాకొల్లి కరుణకుమార్, బోడా ప్రకాష్ ,మానేపల్లి రమేష్, ప్రశాంత్, రాఘవ, శ్రీనివాస్, రాజేష్, ప్రసాద్,కుమ్మర గుంట్ల వీరభద్రరావు పాల్గొన్నారు.



రూ.3 లక్షల సామగ్రితో బయలుదేరిన వాసవీ క్లబ్ వ్యాన్

కడియం మండలవాసుల సాయం..

కడియం, సెప్టెంబరు 13 : వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండలం జేగురుపాడు గ్రామం నుంచి రూ.3,33,999 చెక్కును ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గారపాటి అమరనాథ్, పాతూరి రాజేష్, వెలుగుబంటి నాని, మర్రెడ్డి రమేష్, నాగిరెడ్డి రామకృష్ణ అందజేశారు. దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జమీ, టీడీపీ మైనారిటీ నాయకులు షేక్ సిద్ధయ్య, దర్మానసం శివ, నర్సరీరైతులు రూ.60 వేల విరాళాన్ని అందజేశారు. కడియం వెలుగుబంటి యూత్,రైసుమిల్లర్సు రూ.2,75,000 చెక్కును అందజేశారు. దుళ్ళ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.కడియం ఉన్నత పాఠశాల రెడ్‌క్రాస్ విద్యార్థులు సమకూర్చిన రూ.22,841ను పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ,ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ అందజేశారు.

వృద్ధుడి పెద్దమనసు..

నిడదవోలు, సెప్టెంబరు 13 : సీఎం సహాయనిధికి ఒక మధ్య తరగతి వృద్ధుడు రూ.36 వేలు చెక్కును అందించాడు. నిడదవోలుకు చెందిన మద్దుకూరి నరసింహమూర్తి ప్రస్తుతం కర్నాటకలో ఉంటున్నారు. ఇటీవల నిడదవోలు వచ్చిన ఆయన విజయవాడ వరదను చూసి చలించిపోయారు. ఈ మేరకు శుక్రవారం నిడదవోలు టీడీపీ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం రూ.36 వేల చెక్కును పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, భద్రం, దాసరి లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాలా రూ.లక్ష సాయం



గోపాలపురం, సెప్టెంబరు 13 : మండలం లోని గుడ్డిగూడెం గ్రా మానికి చెందిన శ్రీ శ్రీనివాస ఇండస్ట్రీ ఛైర్మన్ సాగిరాజు అభిమన్యరాజు వరద బాధితుల సహాయ నిధికి రూ.లక్ష చెక్కును నల్లజర్ల క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యే మద్ది పాటికి శుక్రవారం అందజేశారు.వరదబాధితులకు నియోజక వర్గ ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు.



రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి రూ.3,39,999 చెక్ అందజేస్తున్న జేగురుపాడు గ్రామస్తులు



నిడదవోలులో టీడీపీ పట్టణాధ్యక్షుడికి చెక్ అందజేస్తున్న వృద్ధుడు నరసింహమూర్తి



గోదారోళ్ల.. అభిమానం

గోదారోళ్ల అభిమానం అంటే ఇలా ఉంటది మరి.. ఎన్నికల్లో కూటమిగా జట్టు కట్టిన తర్వాత అనపర్తి సీటుపై తర్జనభర్జనలు సాగాయి. నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి సీటు వస్తే తులాభారం వేస్తామని అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలోని బల్లవంతెన విఘ్నేశ్వరుడి ఆలయంలో పడాల రామకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి వేర్వేరుగా మొక్కుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక్కొక్కరు 93 కిలోల బెల్లంతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు.. - అనపర్తి

ఆసుపత్రులకు అనుమతి తప్పనిసరి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు13: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, సంతాన సాఫల్య కేంద్రాలు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం(ఎంటీ పీ) అనుమతి తప్పనిసరిగా పొందాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. బొమ్మూరు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంటీపీ అనుమతుల కు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, కమిటీసభ్యులు, గైనకాలజిస్టులు డాక్టర్ టి.పద్మజ, సిహెచ్.శైలజ, ఎన్జీవో జి.మానస, పంచాయతీరాజ్ సిబ్బంది పి.శశాంక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు లైంగికంగా వేధిస్తున్నాడని..

తల్లిదండ్రుల ఆందోళన



రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 13 : చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని శిక్షించాలంటూ తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళనకు దిగారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఏ బ్లాక్ మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులపై రెండో తరగతి ఉపాధ్యాయుడు సన్యాసిరావు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఆరోపించారు. పాఠశాల వద్దకు పెద్ద ఎత్తున తల్లిదండ్రులు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమ పిల్లల శరీరంపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ ఉపాధ్యాయుడు లైంగికంగా వేధిస్తున్నాడని మండిపడ్డారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీఎస్పీ భవ్య, విద్యాశాఖ అధికారులు పాఠశాల వద్దకు చేరుకుని తల్లిదండ్రులను సముదాయించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థినులపై వేధింపులకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు సన్యాసిరావుపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.రూరల్ ఎంఈవో తులసీదాస్ మాట్లాడుతూ ఈ సంఘటనపై విచారణ అనంతరం నివేదికను డీఈవోకు అందజేస్తామన్నారు.

మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడు విధులు మాకొద్దు

ఎంపీడీవోకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి



ఎంపీడీవో వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

తాళ్లపూడి, సెప్టెంబరు 13: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడు చేసే విధుల నుంచి తమను తప్పించాలని శుక్రవారం మండలంలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయ సిబ్బంది ఈ పనిని తాము చేయలేమని ప్రభుత్వాన్ని కోరగా అలాంటి విధులు తమకు అప్పగించి వివక్ష చూపించడం సరికాదన్నారు. తక్షణమే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గణేష్, వెంకటేష్, కుమార్, శ్రీనివాస్, ఝాన్సీ, కరుణశ్రీ, కవిత, పోసమ్మ, గాయిత్రీ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును తక్షణం అమలుపర్చాలి



జవహర్‌ను సత్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 13: ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణం అమలుపర్చాలని ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపకుడు బుంగా సంజయ్ అన్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌ను కొవ్వూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. సంజయ్ మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం త్వరగా అమలుపర్చాలని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బుంగా దత్తు, పసలపూడి బోసు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే ఆరోగ్య సమస్యలు

అవగాహన సదస్సులో తహశీల్దార్ రాజ్యలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి, సెప్టెంబరు 13: బాల్యవివాహాల వల్ల కలిగే సమస్యలను గ్రామాల్లో ప్రతిఒక్కరికి వివరించాలని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు అవడం వల్ల కాన్పుల సమయంలో సమస్యలు ఏర్పడతాయని, ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. బాల్య వివాహాలు చేసే వారిపై, సహకరించిన వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు అంగన్వాడీ టీచర్లు, వీఆర్వోలు గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదస్సుల్లో గ్రామాల్లోని పురోహితులు, చర్చ్ ఫాదర్లు, ముస్లిం పెద్దలు, కల్యాణ మండపాల యజమానులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ జిల్లా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఎంపీడీవో పి.ప్రభాకర్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లి అవ్వడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం బాల్య వివాహాలను నిలిపివేయాలి అనే పోస్టరును తహశీల్దార్, ఎంపీడీవో వెంకటరమణ తదితర అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఐవోసీఆర్ ఎ.ప్రదీప్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పోలీసు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లపూడిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

రోడ్డు ఫెన్సింగ్‌ను ఢీకొన్న బైక్

దంపతులకు తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు





తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలు

దేవరపల్లి, సెప్టెంబరు 13: దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లజర్ల మండల చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు భార్య సంగీత, ఏడాది వయసున్న కుమారుడితో గోపాలపురం అత్తవారి ఇంటి వద్ద నుంచి చీపురుగూడెం స్వగ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. దేవరపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ అంబులెన్స్‌లో వీరిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. కుమారుడిని స్థానిక సుమంత్ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రమాదమేమి లేదని వైద్యాధికారులు తెలిపారు. దీనిపై ఏ విధమైన ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దేవరపల్లి, సెప్టెంబరు 13: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 12న మండలంలోని యర్నగూడెంలో బస్సు ఢీకొని మోటర్‌సైకిస్టు గాలి శ్రీను(30)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కాగా శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారుల వివరాలు నమోదు

పెరవలి, సెప్టెంబరు 13: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పక్కా ఇళ్లకు సంబంధించి కొంతమందికి బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం అటువంటి వారిని గుర్తిస్తున్నారు. 2014నుంచి 2019వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ గృహాలు మంజూరయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వారికి బిల్లులు నిలిపివేసింది. ఆ విధంగా మండలంలో మొత్తం 624 ఇల్లు మంజూరు కాగా వాటిలో 94 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. వాటికి కొంత మేర సొమ్ము ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో సొమ్ములు ఇవ్వలేదు. ప్రస్తుతం అటువంటి వారిని గుర్తించి మిగిలిన సొమ్ములు చెల్లించడానికి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ విధంగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అతికాల శ్రీను పాల్గొని వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడి బిల్లులు నిలిపివేసిందన్నారు.

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించండి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను అనంతరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, నష్టపరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. ఎస్పీకి మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

17 నుంచి స్వచ్ఛత హి సేవా

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

» పట్టణాలు, గ్రామాల్లో 15 రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణ



సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 13: జిల్లాలో ఈనెల 17 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం-2024పై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్యఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహించాలన్నారు. 18న స్వచ్ఛత పరుగులు, సైక్లాథాన్‌లు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికుల గుర్తింపు, మంజూరైన పథకాలతో అనుసంధానం చేయాలన్నారు. 20న ప్లాంటేషన్ డ్రైవ్, 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కుల శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి పీపీఈ కిట్‌లు, సేఫ్టీ గేర్లు పంపిణీ నిర్వహించాలన్నారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత, 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలు పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రలు వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం, 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు, శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు, స్కాలర్‌షిప్‌ల అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, స్ట్రీట్ క్లీనింగ్ డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ఆస్తుల సుందరీకరణ, ఫుట్ పాత్‌లు, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాల సేకరణ, 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన అభయారణ్యాలు, జూ ప్రాంతాలు, బీచ్‌లు శుభ్రపరచడం, 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై విద్యా పబ్లిక్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం నిర్వహించాలన్నారు. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో జి.నరసింహులు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

» సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుందరబాబు

» సీతారామ్ మృతికి ఘన నివాళి



కొవ్వూరులో సీతారామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 13: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యాదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి, యావత్ భారతదేశానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు అన్నారు. శుక్రవారం కొవ్వూరులో సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సుందరబాబు మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణానికి ఏచూరి విద్యార్థి దశ నుంచి పోరాటం సాగించారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. రాష్ట్ర విభజన నష్టాలను ప్యాకేజీలతో భర్తీ చేయలేరని ఏచూరి అన్నారని, విభజన జరిగి పదేళ్లు పూర్తయినా నేటికి అదే జరుగుతుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గంధం బాపూజి మాట్లాడుతూ ఏచూరి మృతి బాధాకరమని, దేశం ఒక దిగ్గజ నాయకున్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వీ సత్యనారాయణ, కె.కనకరావు, ఎస్.పెంటయ్య, పి.అప్పారావు, వి.చిన్నబాబు, నాగభూషణం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో సీపీఎం ఆధ్వర్యంలో సీతారామ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పార్టీ నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ సీతారామ్ చివరి క్షణం వరకు మతోన్మాద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి, దేశంలోని లౌకికశక్తులను కూడగట్టడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో జి.డేనియల్, ఎర్రా శ్రీను, రసూల్, గంటి కృష్ణ, ఉస్మాన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి కడియాలమ్మ గుడి వద్ద సమీపంలో సీతారామ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమాలు నిర్వహించడమే ఏచూరికి మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెలగా రామకృష్ణ, చాపల వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు ఎస్‌కే.మస్తాన్, సీఐటీయూ నాయకుడు పెంటయ్య, సీఐటీయూ నాయకుడు ఎస్.భగత్, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో సీతారామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో సీతారామ్‌కు సంతాపం తెలుపుతున్న సీపీఎం నాయకులు

వరద బాధితులకు ప్రభుత్వం సత్వర సేవలు

» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

» ముంపు ప్రాంతాల ప్రజలకు నిత్యావసరాల పంపిణీ



మద్దూరులో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 13: విపత్తులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం సత్వర సేవలందిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు మండలం మద్దూరు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని పల్లిపాలెం ముంపు ప్రాంత 17 కుటుంబాలకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలతో ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని, విజయవాడలో ముంపుకు గురయిన ప్రాంతాల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ఆదేశాల మేరకు మంత్రులు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి ఒక యజ్ఞంలా ప్రజలకు సేవలందించారన్నారు. విజయవాడ కలెక్టరేట్‌నే కార్యాలయంగా చేసుకుని సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారన్నారు. గోదావరికి వరద పోటెత్తడంతో మద్దూరులంక పల్లిపాలెంలో నివసిస్తున్న 17 కుటుంబాలకు చెందిన 49 మందిని మద్దూరు హైస్కూల్‌లో పునరావాస కేంద్రానికి తరలించి, ప్రభుత్వం తరపున శుక్రవారం ఒక్కొక్క కుటుంబానికి రూ.3 వేల నగదు, నిత్యావసరాలు అందించామన్నారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం వద్ద ప్రమాదంలో మృతిచెందిన 7 కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూర్యదేవర రంజిత్, సర్పంచ్‌లు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, జెట్టి బంగారయ్య, నాయకులు నాయుడు వీర్రాజు, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్

» 20, 21 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు

» కొవ్వూరు కోఆర్డినేటర్ నాగరాజు



ఉండ్రాజవరం జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు, సెప్టెంబరు 13: కొవ్వూరు నియోజకవర్గ, మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు తేదీలు ఖరారైనట్టు కోఆర్డినేటర్ ఎస్.నాగరాజు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో మండలస్థాయి, 20, 21 తేదీల్లో నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 బాల బాలికల ఆటల పోటీలు జరుగుతాయన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, షటిల్, బాడ్మింటన్ పోటీలు కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్, పీఎంఎంఎంఎం హైస్కూల్, ఏఎస్ జడ్పీ బాలికల హైస్కూళ్లలో జరుగుతాయని చెప్పారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 13: ఉండ్రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-14, 17 క్రీడాకారులు ఎంపిక పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కేఎస్ మాణిక్యాలరావు మాట్లాడుతూ విద్యతోపాటు శారీరక, మానసిక దృఢత్వం ఉన్నపుడే ప్రతి వ్యక్తి అనుకున్న లక్ష్యం సాధించగలడని, అందుకోసం క్రీడా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఎస్ వల్లీ, ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



దేవరపల్లిలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో జరిగిన ఎంపిక పోటీలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడలు ప్రారంభించారు. అనంతర ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోను ప్రతిభ సాధించాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీడీ నాగరాజు మాట్లాడుతూ మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 400మంది పాల్గొన్నారని, ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 18న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, దేవరపల్లి, రామన్నపాలెం హెచ్ఎంలు శ్రీలక్ష్మి, పేరం రవీంద్రనాథ్, పీడీలు ఓరుగంటి రామకృష్ణంరాజు, నాయకులు సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, మాధవరపు వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

మతాలకు అతీతంగా వినాయక ఉత్సవాలు

పెరవలి, సెప్టెంబరు 13: వినాయక చవితి వచ్చిందంటే పిల్లల నుంచి పెద్దలు వరకు అందరికి సరదానే. ఆయా గ్రామాల్లో వివిధ సంఘాలు నెలకొల్పిన వినాయక విగ్రహాలకు తోడుగా పిల్లలు కూడా పోటీలు పడి మరి విగ్రహాలు నెలకొల్పారు. తీపర్రులో పది చోట్ల వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మతాలకు అతీతంగా ముస్లింలు వినాయక విగ్రహాన్ని నెలకొల్పి నిత్యం పూజలు చేస్తూ ఆరాధిస్తున్నారు.



తీపర్రులో విగ్రహం నెలకొల్పి పూజలు చేస్తున్న ముస్లింలు

రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి త్వరగా పూర్తి చేయాలి

» రైల్వే అధికారులతో ఎంపీ పురందేశ్వరి



డీఆర్ఎం పాటిల్‌కి లేఖను అందజేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో చేపట్టే రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధి పనులను వేగంగా నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని రైల్వే ఉన్నతాధికారులతో ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని డివిజనల్ కార్యాలయంలో డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, బ్రాంచి అధికారులు ఆమెకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్మాణాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైల్వే అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ విషయమై నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. అత్యున్నత ప్రమాణాలతో రైల్వే స్టేషన్‌ని అభివృద్ధి చేయాలన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడానికి రూ.284.88 కోట్లతో అంచనాలను రూపొందించినట్టు చెప్పారు. అభివృద్ధి పనులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరు, తూర్పువైపు స్టేషను అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన భూమి తదితర విషయాలపై ప్రత్యేకంగా ఈ సమావేశంలో దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పీఈ ఎడ్విన్, గతిశక్తి సీపీఎం విఠల్, సీనియర్ డీసీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మూల్యాంకనం వైపు అడుగులు

యాప్సీ ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 13: డిజిటల్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని, పరీక్షాపత్రాల మూల్యాంకనం మరింత పారదర్శకంగా సాగుతోందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. పలు కళాశాలలకు సంబంధించిన పలు విషయాలపై అధికారులతో చర్చించారు. నాణ్యమైన ఉన్నత విద్యనందించేందుకు యాప్సీలో వివిధ మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. దానికి అనుగుణంగా విశ్వవిద్యాలయం పనిచేయాలని కోరారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ఐడీలను విద్యార్థులందరూ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో భద్రపరుచుకోవడానికొ మరియు ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా నన్నయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్యవై. శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం రామ్మోహనరావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేసారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, విశ్వవిద్యాలయ అధికార్లు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 13: రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈనెల 27న దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మె సందర్భంగా ఈ నిరసన చేపట్టినట్టు బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీపతిరావు తెలిపారు. ఉద్యోగులకు ఇబ్బంది కలిగేలా యాజమాన్యాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల బ్యాంకులో అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కొత్త ఉద్యోగాల నియామకం లేకపోవడంతో పనిభారం పెరగడం, తాత్కాలిక ఉద్యోగులకు శాశ్వత నియామకాలు చేపట్టకపోవడం, బ్యాంకుల్లో ఏర్పడే సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులను పక్కనబెట్టి కార్పొరేట్ ఏజెన్సీల సలహాలు పాటించడం తదితర అనేక సమస్యలపై ఒకరోజు సమ్మెకు వెళుతున్నామని తెలిపారు. ఆఫీసరు యూనియన్ సంఘం నాయకులు, ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

చాగల్లు, సెప్టెంబరు13: బాల్య వివాహాలు జరక్కుండా చూడడం మనందరి బాధ్యత అని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్) జి.క్రాంతిలాల్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయస్సు రాకుండా వివాహం చేయడం వల్ల శారీరక దృఢత్వం లేక పుట్టే పిల్లలు శరీర లోపం, మానసిక పరిపక్వత లేకుండా పుట్టే అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, ఈవోపీఆర్డీ శ్రవణ్‌కుమార్, ఎంఈవో యు.గురునాథం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం సంప్రదాయాల్లో భాగం



చాగల్లు, సెప్టెంబరు 13: కళలను ప్రోత్సహించడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగమని పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం రాత్రి తెలగా సంఘం ఆధ్వర్యంలోని శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో వర్ధమాన సినీహీరో రవికృష్ణను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుమ్మడి గోపాలకృష్ణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్ రవికృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 69ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తూ నాటకాలను ప్రదర్శించడం, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. హీరో రవికృష్ణ మాట్లాడుతూ చాగల్లు ప్రజలు చూపిస్తున్న అభిమానం ఎన్నటికి మరచిపోలేనన్నారు. అలాగే గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బొల్లా స్నేహకు వర్థినీడి భీమేశ్వరరావు కుమారులు సమకూర్చిన బంగారు పతకాన్ని ముఖ్య అతిథులు అందజేశారు. ఇంటర్ మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన మహ్మద్ ఆయేషాసిద్దికకు జగతా వీరభద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరావు సమకూర్చిన బంగారు పతకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, నాయకులు కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్, జుట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీగాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్